VASANTH KUMAR
Director
QUALITY SERVICE SINCE 1997
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
EDUCATION IN AUSTRALIA
AAERI MEMBER
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
: 91(40) 27628104, 27674007
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

MAHESH KUMAR KOVURY
CELL 9885624338
STOOP
TAILORS&TEXTILES
SUITING, SHIRTING&READYMADES
MENS'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,
CHATRINAKA

సంపుటి: 3 సంచిక: 314, పేజీలు - 08
మంగళవారం, ఫిబ్రవరి 27, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## కోర్టు తీర్పు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నా

### - లిక్కర్ స్కామ్ కేసుపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కి ఈడీ ఏడోసారి సమన్లు పంపింది. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు కేజ్రీవాల్. ఈ కేసులో ఆరు సార్లు సమన్లు పంపినా కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదు. అయితే ఈ సమన్లపై ఆయన స్పందించారు. కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నట్టు వెల్లడించారు. పదేపదే ఇలా సమన్లు పంపడం కన్నా కోర్టు ఏదోటి తేల్చేయాలని అన్నారు. ఏడోసారి కూడా సమన్లను పట్టించుకోలేదు కేజ్రీవాల్. కేవలం కాంగ్రెస్‌తో తాము చేతులు కలుపుతున్నందుకే బీజేపీ కుట్ర పూరితంగా తమను టార్గెట్ చేసినట్టు ఆరోపించారు. అంతే కాదు, లోక్‌సభ ఎన్నికల ముందు ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని మండి పడ్డారు. ఆ కూటమితో తెగదెంపులు చేసుకోవాలనే ఇలా బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయాలన్నదే బీజేపీ కుట్ర. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ కోర్టు వరకూ వెళ్లింది. అలాంటప్పుడు కోర్టు తీర్పు ఏమిస్తుందో ఎదురు చూడాలిగా..? కోర్టు నిర్ణయమేంటో తెలుసుకోవాలిగా. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. ఇలా మళ్లీ మళ్లీ సమన్లు జారీ చేయడం దేనికి..? ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చేయాలంటూ కొందరు మాపై ఒత్తిడి తెస్తున్నారు. ఎలాంటి పరిస్థితి వచ్చినా ఈ ప్రతిపక్ష కూటమి నుంచి బయటకు రామన్నారు కేజ్రీవాల్. ఇప్పటికే బీజేపీ తమ

6లో

## కేసీఆర్ నాట్ రీచబుల్

### - ట్రై ఆఫ్టర్ లోక్ సభ ఎలెక్షన్స్



**హైదరాబాద్ :** ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో బీఆరెస్స్ కు కష్టకాలం నడుస్తుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడినప్పటినుంచీ పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఇప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించాలంటే అందుకు ప్రధానంగా అధినేత ఏమాత్రం సంసిద్ధత వ్యక్తం చేయలేకపోతున్నారని అసెంబ్లీలో అటు పక్కన కూర్చోడానికి ఆయన ఇష్టపడటం లేదని కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఒక్క ఎలక్షన్ బీఆరెస్స్ పూసాలు కదిలించిందనే కామెంట్లు వినిపిస్తుంటే మరోపక్క జాతీయస్థాయిలో మనుగడ పూర్తిస్థాయిలో ప్రశ్నార్థకం అయ్యిందనే మాటలూ వినిపిస్తున్నాయి. అవును తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని బీఆరెస్స్ అధినేత కేసీఆర్ అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఈ సమయంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని బలంగా భావించి తెలంగాణ సెంటిమెంట్ తో ఉన్న టీఆరెస్స్ ను బీఆరెస్స్ గా కూడా మార్చగలిగారు కేసీఆర్. ఈ క్రమంలో జాతీయ రాజకీయల సంగతి దేవుడెరుగు తెలంగాణలోనే ప్రతిపక్ష పాత్ర దక్కింది ఈ నేపథ్యంలో జాతీయస్థాయి నేతలకు కేసీఆర్ అస్సలు అందుబాటులోకి రావడం లేదని తెలుస్తుంది. విషయంలోకి వస్తే తెలంగాణతో పాటు జాతీయస్థాయిలోనూ కారు జోరు చూపించాలని కేసీఆర్ భావించారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆయా ప్రాంతాల్లో ఆఫీసులు ఓపెన్ చేశారు. ఇక ప్రధానంగా మహారాష్ట్రలో అయితే వరుస బహిరంగ

6లో

## ఏళ్లుగా తిష్టవేసిన అధికారులను బదిలీ చేయాలి

### - సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

- పన్ను వసూళ్లలో అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యం సాధించాలి
- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణా అరికట్టాలి
- వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలు ఉండాలి
- సమగ్రమైన ఇసుక విధానంతో అక్రమాలను అడ్డుకోవాలి
- గనుల శాఖ విధించిన జరిమానాలు వసూలు చేయాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష

6లో

## కుప్పం కేంద్రంగా సీఎం జగన్ కీలక ప్రకటన

### - టార్గెట్ చంద్రబాబు





**కుప్పం (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి జగన్ కుప్పంలో కీలక వ్యాఖ్యలు చేసారు. 35 ఏళ్లుగా చంద్రబాబు కుప్పంకు ఏం చేసారని ప్రశ్నించారు. తన 58 నెలల పాలనలో కుప్పంకు జరిగిన మంచి గుర్తించాలని కోరారు. జరిగిన లబ్దిని వివరించారు. చంద్రబాబు మార్క్ రాజకీయం ఏంటో విశ్లేషించారు. కాపులకు చంద్రబాబు చేసిన మంచి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేసారు. రంగాను హత్య చేయించింది ఎవరో అందరికీ తెలుసని సీఎం జగన్ వ్యాఖ్యానించారు.

**కుప్పంలో సీఎం జగన్**

సీఎం జగన్ కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి విడుదల చేశారు. హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.560.29 కోట్ల వ్యయంతో చేపట్టిన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తిచేశామని తెలిపారు. 35 ఏళ్ల కాలంగా కుప్పంకు ఏమీ చేయని చంద్రబాబును గెలిపించాల్సిన అవసరం ఉందా అని జగన్ ప్రశ్నించారు. చంద్రగిరిలో మంత్రిగా ఉంటూ పోటీ చేసిన చంద్రబాబు చిత్తుగా ఓడారని గుర్తు చేసారు. 35 ఏళ్లు ఇక్కడ ఎమ్మెల్యే గా ఉండి కనీసం ఇళ్లు కట్టుకోలేదనన్నారు. కుప్పం ప్రజలు చంద్రబాబును

6లో

## ఏపీలో తొలి గ్యారెంటీని ప్రకటించిన షర్మిల

- అనంతపురంలో కాంగ్రెస్ న్యాయసాధన సభ
- ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున ఖర్గే
- తొలి గ్యారెంటీని ప్రకటించిన కాంగ్రెస్




**అనంతపురం (ప్రశ్న న్యూస్)** ఏపీలో కాంగ్రెస్ పార్టీ తొలి గ్యారెంటీని ప్రకటించింది. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ ఏపీలోనూ పునర్వైభవం సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. అందులో భాగంగా అనంతపురంలో జరిగిన న్యాయసభలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తొలి గ్యారెంటీని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రతి నెలా ఐదువేలు ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ అభయం కింద ఇంటింటికి మహిళల పేరు మీద రూ.5 వేల ఆర్థిక సాయం అందజేస్తామని వెల్లడించారు. మహిళల పేరు మీదనే చెక్కు పంపిణీ చేస్తామని షర్మిల

6లో

## మీరు మీ అమ్మకే పుట్టారని గ్యారంటీ ఏంటి.?

### - బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** బీజేపీ ఎంపీ బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు మీ తల్లికే పుట్టారా గ్యారంటీ ఏంటి అని వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో బండి సంజయ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాజా వ్యాఖ్యలు చేశారు. రాముడు అయోధ్యలో పుట్టాడనేందుకు గ్యారంటీ ఏంటని కాంగ్రెస్ నేతలు అంటున్నారని గుర్తు చేశారు. రాముడు అయోధ్యలోనే పుట్టినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయని బండి సంజయ్ అన్నారు. మరి మీరు మీ తల్లికే పుట్టారనేందుకు గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం బాగా వైరల్ అవుతోంది. కవిత లిక్కర్ కేసు గురించి మాట్లాడుతూ సీబీఐ, ఈడీ, బీజేపీకి సంబంధం లేదని అన్నారు. వారికి ఉన్న అధికారాలు, ఆధారాలకు లోబడే కవితపై చర్యలు తీసుకుంటారని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అని అన్నారు. గతంలో వారే అధికారాన్ని పంచుకున్నారని యూపీఏ హయాంలో కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. గతంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేసి తమ కొంపముంచారని అన్నారు. విజయ సంకల్ప యాత్రలకు మంచి స్పందన ఉందని వారంలో తెలంగాణలో వీలైనన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించబోతున్నామని చెప్పారు. కేంద్రంలో 370 పార్లమెంట్ సీట్లు గెలవడమే తమ లక్ష్యం అని అన్నారు. ఈసారి మోదీ నాయకత్వంలో తమ లక్ష్యాన్ని తప్పకుండా చేరుతామని అన్నారు. నరేంద్ర మోదీ కూడా తప్పకుండా మూడోసారి ప్రధాని అవుతారని అన్నారు. తెలంగాణలో కూడా హైదరాబాద్ సహా 17 సీట్లు గెలుస్తామని చెప్పారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని బీఆర్ఎస్ పార్టీది మూడో స్థానమే అని అన్నారు.

## ఒక్కొక్కరికి కోటి భీమా

- సింగరేణి ఉద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త
- ఇక ఒక్కొక్కరికి రూ.కోటి ప్రమాద బీమా
- ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి సంస్థ కూడా కీలక పాత్ర పోషించిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కానీ బీఆర్ఎస్ పాలనలో గత పదేళ్లు సింగరేణి కార్మికులకు సరైన

6లో

## రెండో రోజే కొట్టుకుపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జి



- విశాఖ ఆర్కే బీచ్‌లో తెగిపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జి
- రెండో రోజే తెగిపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్
- ఎవరూ లేకపోవటంతో తప్పిన ప్రమాదం

**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖ ఆర్కే బీచ్‌లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోయింది. ఆదివారం అట్టహాసంగా ప్రారంభించిన ఫ్లోటింగ్ బ్రిడ్జి రెండో రోజే తెగిపోయింది. ఫ్లోటింగ్ బ్రిడ్జిలోని చివరి భాగం తెగిపోయి సముద్రంలోకి కొట్టుకుపోయింది. అయితే ఆ సమయంలో అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. దీంతో ఆర్కే బీచ్ అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులు భయపడిపోయారు. ఘటన జరిగిన సమయంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి మీద ఎవరూ లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆర్కే బీచ్ వద్ద వైఎంసిఏ సమీపంలో నిర్మించిన ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఆదివారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిని సుమారు కోటీ 60 లక్షల వ్యయంతో నిర్మించారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని

6లో

## నేడే రెండు గ్యారెంటీల అమలు

### - తెలంగాణ ప్రభుత్వ ఆహ్వాన పత్రిక




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ తెలంగాణ పర్యటన రద్దయింది. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన రద్దు అయినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ యథాతథంగా నేడు చేవెళ్లలో గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్(200 యూనిట్లు) పథకాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. ఇందులో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశారు. తాజాగా మరో రెండు పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు సాయంత్రం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వాన లేఖను విడుదల చేసింది. గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం రేపు సాయంత్రం 4 గంటలకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఫరా ఇంజినీరింగ్ కాలేజీలో జరగనుందని ఆహ్వాన పత్రికలో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని, విశిష్ట అతిథిగా మల్లు భట్టి విక్రమార్క వస్తున్నట్లు పేర్కొంది. సభాధ్యక్షులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించనున్నట్లు ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ - శేరిలింగంపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర ఆధునీకరణకు రహేజా గ్రూప్ తోడ్పాటు అభినందనీయం**

**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధునీకరణకు రహేజా గ్రూప్ తోడ్పాటు అభినందనీయమనిశేరిలింగంపల్లి స్థానిక శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ అన్నారు సోమవారం నాడు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు రహేజా గ్రూప్ సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 42 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టిన శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కృషి చేస్తున్నారని వారి సహకారం తో.సిఎస్అర్ కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కలిపించాలని,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం అని ,దానిలో భాగంగా ,అని హంగుల తో ,సకల సౌకర్యాలతో నిర్మించిన కొత్త భవనం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం అని, అతి తక్కువ సమయంలో భవనం నిర్మించి నేడు ప్రజలకు అందుబాటులో కి తీసుకురావడం చాలా అభినందనియం అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు అందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ వర్క్స్, శానిటరీ ఆరెంజ్మెంట్స్, త్రాగు నీరు, ఎలక్ట్రిసిటీ , మౌలిక సదుపాయాలఏర్పాటు చేస్తామని,ప్రజలకు అన్ని రకాల వసతులు కలిపిస్తామని, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది అని,తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగం కు పెద్దపీట వేశారనీ,తెలంగాణ వచ్చిన తర్వాత మాజీ సీఎం కెసిఆర్ ప్రజారోగ్యం మీద దృష్టి సారించి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించేందుకు పూనుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోహన్ గౌడ్ ,విరేశం గౌడ్,రాజేశ్వరమ్మ, శేరిలింగంపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మారబోయిన రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, వార్డ్ మెంబర్ రాంబాబు, సీనియర్ నాయకులు ,జనార్దన్ రెడ్డి, పద్మారావు, శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, రాంచందర్, శ్రీనివాస్ యాదవ్, కేవన్ రాములు, గోపాల్ యాదవ్, రమేష్, బసవయ్య, కోదండరాం, వెంకట్ రెడ్డి, సత్తర్, నయీమ్, రహీం, అహ్మద్, పున్నారావు, నరసింహ, జమ్మయ్య, మహేష్ చారీ, విజయానంద్, వహీద్, వెంకటేశ్వర్లు, మహేందర్ సింగ్, సుమన్, సత్యనారాయణ సింగ్, విజయ్ కుమార్, నటరాజ్, సురేష్, కుటుంబ రావు, రాజు, దస్తగిర్, శ్రీనివాస్, ఉపేందర్, పెంటయ్య, విజయ్, మహిళా నాయకురాళ్లు ముంతాజ్ బేగం, భాగ్యలక్ష్మి, జయ, సుజాత, శశికళ, దివ్య, నిరూప, సబియా, గౌసియా, కుమారి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్‌కు ఎంపిక కావడం శుభ పరిణామం

## ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి , కలెక్టర్ రాజర్షి షా

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) దేశంలోని 554 రైల్వేస్టేషన్ లను ఆధునీకరించే ఉద్దేశ్యంతో ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ వర్చ్యువల్ గా శంకుస్థాపన గావించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మెదక్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సభనుద్దేశించి మాట్లాడుతూ... మెదక్ ప్రజల దశాబ్దాల కోరిక మెదక్ రైల్వే స్టేషన్ అని, మెదక్ రైల్వే సాధన సమితి నాయకులు మరియు ఎంతోమంది నాయకులు మెదక్ రైలు తేవడానికి ఎన్నో రకాలుగా శ్రమించారని వారి కృషిని ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ శేరి అన్నారు. దేశంలో రైల్వే స్టేషన్లను ఆధునికకరించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అమృత్ భారత్ పథకంలో భాగంగా మెదక్ స్టేషన్ను ఎంపిక చేసి 15 కోట్ల రూపాయలు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి మరియు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్సీ శేరి పేర్కొన్నారు. మెదక్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందాలని సగటు మెదక్ వాసుల ఆశ అని, మెదక్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందాలంటే మెదక్ నుండి మనోహరాబాద్ వరకు రైలు మార్గం వేయడం ద్వారా దూరం తగ్గి ప్రయాణ సదుపాయం పెరుగుతుందని అన్నారు. అంతేగాక భవిష్యత్తులో మనోహరాబాద్ రైల్వే జంక్షన్ గా ఏర్పడే అవకాశం ఉన్నందున మరియు హైదరాబాద్ నుంచి నగర సమీప ప్రాంతాలకు పుష్ పుల్ ట్రైన్లు నడిచే అవకాశం ఉన్నందున మెదక్ అభివృద్ధికి అవకాశం ఉండే విధంగా రైలు ప్రయాణాన్ని సులభతరం చేయాలని ఎమ్మెల్సీ రైల్వే అధికారులను కోరారు. ఈ ప్రతిపాదిత మార్గం ద్వారా హైదరాబాద్ నుండి నిజామాబాద్-నాందేడ్ దూరం కూడా తగ్గి త్వరగా వెళ్లే అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ సబికులతో పేర్కొన్నారు. ఈ విధంగా రైల్వే స్టేషన్ కు మరిన్ని సదుపాయాలు కల్పిస్తే మెదక్ పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. దీంతోపాటు ఇప్పటికే సర్వే పూర్తయిన మెదక్ నుండి పటాన్చెరు (వట్టినాగులపల్లి) వయా జోగిపేట సంగారెడ్డి రైల్వే లైను పనులను త్వరగా ముందుకు తీసుకెళ్తే ఈ ప్రాంతం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఈ ప్రాంత బిడ్డగా ఇది తన కోరిక అని ఎమ్మెల్సీ శేరి పేర్కొన్నారు. ఈ విధంగా మెదక్ ప్రాంత అభివృద్ధికి దోహదపడే రైలు మార్గాలను కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయాలని తాను కోరుకుంటున్నానని ఎమ్మెల్సీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మెదక్ పట్టణం లో ఉన్న రైల్వే స్టేషన్ కు మౌలిక సదుపాయాల కొసం దాదాపు 16 కోట్లు కేటాయించారని,దీనితో మౌలిక సదుపాయాలు ఆధునీకరించడం వల్ల జిల్లా ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. మెదక్ రైల్వే స్టేషన్ లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం వల్ల జిల్లా లో వ్యవసాయం,పారిశ్రామిక,ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు పెరుగుతాయన్నరు. మహిళలకు,విద్యార్థులకు, ఉద్యోగులకు, అలాగే సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. వికసిత భారత్ కార్యక్రమంలో వివిధపోటీలలోపాల్గొని ,గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రలు అందించారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ,మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్ర పాల్, బి జే పీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రైల్వే అధికారులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం నియమ నిబంధనలు పాటించని పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి: మణికంఠ



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ మండలంలో అనుమతి లేకుండా ప్రైమరీ పాఠశాలలు రోజు రోజుకు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి అని ఉప్పల్ మండల్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు మణికంఠ తెలిపారు. వీటి పై విద్య శాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ప్రైమరీ పాఠశాల ల ఉపాధ్యాయుల తో లోపాయికారి ఒప్పందం జరిగిందా అని అనుమానం కలిగిస్తుందని, ఉప్పల్ మండలంలో అనేక ఎ5ఠశాలలు ప్రైమరీ స్కూలు అనుమతులు లేకుండా పాఠశాలను నడిపిస్తున్నారని, ఆర్కే స్కూల్, శుభోద, సన్స్ వంటి పాఠశాలలకు అనుమతులు లేకుండా ఎన్నో ఉన్నాయని, ప్రైమరీ పాఠశాలలో కనీస వసతులు కూడా లేవని, ప్రభుత్వ నియమ నిబంధనలను ఎవరు పాటిస్తే లేరని, ఫీజులు మాత్రం వేలకు వేలు వసూలు చేస్తున్న వైనం మనకు కనిపిస్తుందని అన్నారు.మరీ ముఖ్యంగా కొన్ని పాఠశాలలో 7వ తరగతి వరకు అనుమతులు తీసుకొని 10వ తరగతి వరకు స్కూల్ లో బోర్డు పెట్టి నడుపుతున్నారని అలాంటి పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ, డీఈఓ కు, ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన పాఠశాలల పై చర్యలు తీసుకోవడం లేదని త్వరలోనే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మణికంఠ తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**- జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) చేవెళ్ల మాజీ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీజేపీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్,అప్పా జంక్షన్,సంధ్యా గార్డెన్స్ లో అంగ రంగ వైభవంగా నిర్వహించిన జననేత, నిగర్వి, విద్యావేత్త , వ్యాపారవేత్త, ప్రజల కోసం పోరాడే మంచి మనిషి , ఆత్మీయ సోదరుడు చేవెళ్ల మాజీ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలలో హుజూరాబాద్ మాజీ శాసనసభ్యులు ఈటెల రాజేందర్, శేరిలింగంపల్లి బీజేపీ శ్రేణులతో కలిసి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,బీజేపీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బిజెపి కంటెస్టెంట్ కార్పొరేటర్ ఎల్లేష్, బిజెపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ పీఓ బదిలీ నిలిపివేయాలని రాస్తారోకో



ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్) ఐటీడీఏ పీఓ అంకిత్ ఐఏఎస్ బదిలీని నిలిపివేయాలని నాయకపోడు తుడుందెబ్బ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గిరిజనులకు న్యాయం చేస్తున్న పీఓను అకారణంగా బదిలీ చేయడం బాధాకరమన్నారు. మంత్రి సీతక్క, కలెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ, స్పందించి పీఓ బదిలీని వెంటనే నిలిపివేయాలన్నారు. లేదంటే గ్రామాల నుండి ఇంకా నిరసన సెగలు కొనసాగిస్తాం అని తుడుం దెబ్బ మహిళా సంఘం ద్వారా ఐటీడీఏ డబ్ల్యు సంతోష్ కు వినతి పత్రం అందజేశారు గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఇలాంటి పీఓ ఏజెన్సీలో ఉండాలి అని అన్నారు

## అంగన్వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

**జిల్లా పాలనాధికారి యూనిస్ కి వినతి పత్రం**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) అంగన్వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా పాలనాధికారి యూనిస్ కి,ఐసీడీఎస్ జిల్లా డైరెక్టర్ బ్రహ్మాజీ కి వినతి పత్రం అంగన్వాడీ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యం లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం ,కార్యదర్శి నర్సమ్మ,సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు డిసెంబర్ ,జనవరి నెలల వేతనాలు చెల్లించక పోతే ఏమి తిని పని చేస్తారని ఆమెప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గ్రామాలలోతల్లులకు, గర్భవతులకుపిల్లలకు పోషకాహారం అందించే వారికే వేతనాలు ప్రతినెలచెల్లించక పోతే ఎలాబతుకుతారన్నారు. అంగన్వాడీ జీతమే జీవనాధారం ,వేరే ఆర్థిక అవకాశాలు ఏమి లేవని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని అన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే వారికే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు వేతనాలు చెల్లించి మెదక్ జిల్లాకు చెల్లించక పోవడం సరైంది కాదని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి డిసెంబర్, జనవరి నెలల వేతనాలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ, జిల్లానాయకులుమంజుల, సంతోష,ఫరీద్, జయ, సుజాత, ప్రమీల, స్వప్న, లక్ష్మి, టీచర్స్ పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి"

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్ లో పల్స్ పోలియో కార్యక్రమం గురించి డీటీఫ్ డిస్టిక్ టాస్క్ ఫోర్స్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.మెదక్ జిల్లాలో మార్చ్ 3, 4, మరియు 5 తేదీలలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలియజేశారు.జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 157 ఆరోగ్య ఉప కేంద్రాలు,1,74,534 నివాసపు ఇండ్లు,25 ట్రాన్సిట్ పాయింట్లు,176 హైరిస్క్ కేంద్రాలు మొదలగు అన్నింటిలో 523 పోలియో బూత్ కేంద్రాలు, 1046 టీముల ద్వారా,53 రూట్ల లో 2332 వ్యాక్సినేటర్ల చే మెదక్ జిల్లాలో నిర్దేశించబడిన 67962 మంది అప్పుడే పుట్టిన పిల్లలనుండి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలని తెలియజేశారు. మార్చ్ 3 ఆదివారం రోజున పోలియో బూత్ కేంద్రాలలో మార్చ్ 4,5 తేదీలలో మిగిలిపోయిన పిల్లలందరికి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్వలెన్స్ అధికారి డాక్టర్ మురారి రాజేంద్ర ప్రసాద్ ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చందు నాయక్ , జిల్లా విద్యాధికారి రాధా కిషన్ డి డబ్ల్యు బ్రహ్మాజీ , డిస్టిక్ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ నాగరాజు , ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్పల్లిలో నాసిరకం మద్యం అది తీసుకుంటే మరణం తథ్యం



ధర్పల్లి(ప్రశ్నన్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం లో అక్రమ, నాసి రకం మద్యం తయారు చేసి విక్రాయిస్తున్న మద్యం మ్యాఫియా పై చర్యలు తీసుకోవాలి ధర్పల్లి మండలంలో అక్రమ, నాసిరకం మద్యం తయారు చేసి విక్రాయిస్తున్న మద్యం మ్యాపియాపైచర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎం .ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)పార్టీ ల ఆధ్వర్యంలో సోమవారం నాడు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ కు పిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులను రద్దు చేసి వాటి పై చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికి అట్లాంటి చర్యలు ప్రభుత్వం తీసుకున్న దాకలాలు లేవు. దీన్ని ఆసరాగా చేసుకొని మద్యం వ్యాపారులు ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, మండల కు చెందిన వైన్స్ ల యాజమాన్యాలు విచ్చలవిడిగా గ్రామాలను పంచుకొని నాసిరకం మద్యం తయారు చేయడమే కాకుండా బెల్ట్ షాప్ లను నిర్వహిస్తు, నాసిరకం మద్యంను విక్రయిస్తు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీని వల్ల సామాన్య ప్రజలు తీవ్రమైన అనారోగ్యం పాలు అవుతున్నారు. డబ్బు ఉంది అన్న ధీమాతో మమ్మల్ని ఎవరు ఎం చేయరు అన్న ధీమతో నాసిరకం మద్యం అమ్మకాలను జోరుగా సాగిస్తున్నారు. దీనితో ఇటు ప్రభుత్వ ఆదాయంకు, అటు ప్రజల ఆరోగ్యం కు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేకంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్ ల పై విసిగి పోయిన గ్రామల్లోని యువత, మహిళా లు దాడులు చేసే అవకాశం కూడా ఉంది. కావున తమరు ఈ అక్రమ మధ్యాన్నీ చట్టవ్యతిరేకంగా విక్రయిస్తున్న మూడు వైన్స్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలోకి తీసుకొని గ్రామాల్లో బెల్ట్ షాప్ లను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్,ప్రజా సంఘాల డివిజన్, మండల నాయకులు, ఆర్. దామోదర్, డి.సాయరెడ్డి, ఎం.లింబాద్రి, ఈ రమేష్ , బి కిషోర్, యస్ గంగమల్లు, బి సర్పంచ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# పెరిగిన తలసరి ఆదాయం.. దేనికి సంకేతం..

దేశంలో తలసరి ఆదాయం భారీగా రికార్డయింది. ప్రజల ఖర్చు అలవాట్లు మారుతున్నాయి గ్రామాల నుంచి నగరాల వరకు నిత్యావసర వస్తువులపై వ్యయం పెరుగుతోంది. ఉద్యోగులు, కార్మికుల సగటు నెలవారీ జీతం విషయంలో భారత్ చాలా దేశాల కంటే వెనుకబడిందని 'నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ సంస్థ పేర్కొంది. మొత్తం దేశ జనాభా సగటును పరిశీలిస్తే, 2011 12తో పోలిస్తే 2022 23 నాటికి వారి నెలవారీ వినియోగదారుల వ్యయం దాదాపు రెట్టింపు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ప్రస్తుత ధరల ప్రకారం దేశంలోని కుటుంబాల తలసరి సగటు నెలవారీ గృహ వ్యయం 2022 23లో రూ.6,459గా ఉంటుందని అంచనా. కాగా 2011 12లో రూ.2,630. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దం క్రితం రూ.1,430గా ఉన్న రూ.3,773కి పెరిగింది.అయితే, నగరాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు రోజువారీ ఖర్చులు చాలా తక్కువ అని ఇటీవల నిర్వహించి సర్వేలో వెల్లడైంది. గ్రామంలోని పేదల జీవితం రోజుకు రూ.45 మాత్రమే ఖర్చు అవుతుండగా, నగరంలో నివసించే అత్యంత పేద వ్యక్తి రోజుకు రూ.67 ఖర్చు చేయగలుగుతున్నాడు.నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ ఇటీవల నెలవారీ సగటు తలసరి వినియోగదారు వ్యయం డేటాను విడుదల చేసింది.ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి చేయబడిన అంతిమ వస్తు సేవల మొత్తం విలువనే జాతీయాదాయం అంటారు. జాతీయాదాయంలో పెరుగుదల సంభవిస్తే దానిని అభివృద్ధికి సూచికగా భావించవచ్చు. జాతీయాదాయంలో పెరుగుదల రెండు కారణాల వల్ల సంభవించవచ్చు. అవి. ఉత్పత్తిలో పెరుగుదల, ధరల స్థాయిలో పెరుగుదల. అయితే, నామ మాత్రపు జాతీయాదాయంలో పెరుగుదలను అభివృద్ధికి సూచికగా భావించడం సరికాదు. వాస్తవ జాతీయాదాయంలో పెరుగుదలను అభివృద్ధికి సూచికగా భావించడం ఉత్తమం. ఒక నిర్ణీత ప్రదేశంలో నివసించే ప్రజల సగటు వార్షిక ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. జాతీయాదాయాన్ని జనాభాతో భాగిస్తే తలసరి ఆదాయం తెలుస్తుంది. జాతీయాదాయంలో పెరుగుదల కంటే తలసరి ఆదాయంలో పెరుగుదలను అభివృద్ధికి మేలైన సూచికగా భావించవచ్చు. తలసరి ఆదాయంలో పెరుగుదల అభివృద్ధికి సూచికే. కానీ ప్రస్తుత ధరల్లో తలసరి ఆదాయం పెరిగితే అభివృద్ధికి సూచికగా భావించడం సమంజసం కాదు. అందుకే వాస్తవ తలసరి ఆదాయంలో పెరుగుదలను అభివృద్ధికి మేలైన సూచికగా భావించవచ్చు. ఈ గణాంకాలు గృహ వినియోగ వ్యయ సర్వే 2022 23 పై ఆధారపడి ఉన్నాయి. దీని ప్రకారం, గ్రామంలో అత్యల్ప స్థాయిలో నివసిస్తున్న 5 శాతం జనాభా సగటు నెలవారీ తలసరి వినియోగదారు వ్యయం రూ.1,373 మాత్రమే. దీని ప్రకారం, ఇది రోజుకు రూ.45 వరకు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడైంది. పట్టణ జనాభా డేటాను పరిశీలిస్తే, నగరాల్లో నివసిస్తున్న పేదలు 5 శాతం జనాభాలో ప్రతి వ్యక్తి సగటు నెలవారీ ఖర్చు రూ. 2001. రోజువారీ ప్రాతిపదికన, ఈ ఖర్చు దాదాపు రూ.67 వరకు వస్తుంది.ాఅఖా ఫ్యాక్ట్ షీట్ ఆధారంగా, గ్రామాలు, నగరాల్లోని ధనవంతులలో టాప్ 5 శాతం ఉన్న వ్యక్తులతో పోల్చినట్లయితే, గ్రామంలో వారి తలసరి నెలవారీ సగటు వినియోగదారు వ్యయం రూ. 10,501 (రోజుకు రూ. 350). పట్టణ ప్రాంతాల్లోని టాప్ 5 శాతం ప్రజల సగటు నెలవారీ వినియోగదారు వ్యయం రూ. 20,824 (రోజుకు రూ. 695).ఈ వృద్ధిని పరిశీలిస్తే, గ్రామీణ జనాభా సగటు నెలవారీ గృహ వ్యయంలో 164 శాతం పెరుగుదల నమోదైంది. అయితే పట్టణ జనాభా వ్యయంలో ఈ పెరుగుదల 146 శాతంగా ఉంది. ఔఖూ సాధారణంగా ఈ గణాంకాలను ప్రతి 5 సంవత్సరాలకు విడుదల చేస్తుంది. పదేళ్ల వ్యవధిలో ఈసారి ఈ గణాంకాలు వెలువడ్డాయి.2023-24 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 2,42,479 కోట్లుగా ప్రభుత్వం తేల్చింది. దీనికి సంబంధించిన నివేదికను ప్రభుత్వం సిద్ధం చేసింది.

గతేడాది కన్నా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10.28 శాతం వృద్ధి నెలకొన్నటు ఈ నివేదికలో పేర్కొన్నారు. ఇంతలా పెరగడానికి కారణాలను మాత్రం విశ్లేషించలేదు. అయితే ఇంత భారీగా తలసరి ఎలా పెరుగుతోందో అర్థం కావడం లేదని పలువురు అధికారులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి కేవలం 1,0,676 రూపాయల తలసరి ఆదాయం ఉండగా, 2019-20 నాటికి 1,60,341 రూపాయలకు చేరింది. 2021-22లో స్వల్పంగా మాత్రమే తలసరి ఆదాయం పెరిగినట్లు చూపించగా, ఆ తరువాత సంవత్సరాల నుంచి ఒక్కసారిగా భారీగా పెరుగుదల చూపించడం విశేషం. అక్కడి నుంచి వరుసగా 17.45 శాతం, 11.49 శాతం, 10.28 శాతంగా తలసరి పెరిగినట్లు అధికారులు పేర్కొనడం విశేషం. ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాల ద్వారానే ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని చెబుతున్న ప్రణాళిక శాఖ అధికారులు, అదే సమయంలో భారీగా పెరుగుతున్న ఖర్చులను విస్మరించి తలసరిని గణిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి

# డెంగ్యూ నుంచి త్వరగా బయటపడేసే ఈ ఫుడ్ ఐటమ్స్ మీకు తెలుసా..?







ప్రతి ఏడాది భారీ సంఖ్యలో జనం డెంగ్యూ బారిన పడుతున్నారు. డెంగ్యూ దోమల సంతతి పెరగడానికి నిలువ నీరు కారణమవుతున్నది. ఒకవేళ మీరు డెంగ్యూ బారినపడితే తిరిగి కోలుకునే వరకు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం. మీరు ఎంత త్వరగా డెంగ్యూ నుంచి కోలుకుంటారనేది మీరు తీసుకునే ఆహారంపై కూడా ఆధారపడి ఉంటుంది. కాబట్టి డెంగ్యూ బారీ నుంచి సత్వరమే బయటపడేసే కొన్ని ఆహార పదార్థాల గురించి ఇక్కడ తెలుసుకుందాం..

**1. కొబ్బరి నీళ్లు :** డెంగ్యూ బారిన పడితే శరీరం బాగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి కొబ్బరి నీళ్లు బాగా తోడ్పడుతాయి. కాబట్టి డెంగ్యూ రోగులకు వైద్యులు కొబ్బరి నీళ్లు తాగాలని సూచిస్తుంటారు.

**2. బొప్పడి ఆకుల రసం** బొప్పడి ఆకుల రసం కూడా డెంగ్యూ చికిత్సలో బాగా పనిచేస్తుంది. డెంగ్యూ రోగి బొప్పడి ఆకుల రసం తీసుకోవడం వల్ల ప్లేట్‌లెట్ కౌంట్ మెరుగుపడుతుంది. అదేవిధంగా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. మంచి ఫలితం రావాలంటే డెంగ్యూ పేషెంట్ బొప్పడి ఆకుల రసాన్ని నీటితో కలిపి రోజుకు రెండుమూడు సార్లు తీసుకోవాలి.

**3. మేక పాలు** మేక పాలలో సెలెనియం పుష్కలంగా ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో సెలెనియం కీలకపాత్ర పోషిస్తుంది. శరీరంలో వైరస్‌లు వృద్ధి చెందకుండా కూడా సెలెనియం తోడ్పడుతుంది. కాబట్టి డెంగ్యూ పేషెంట్‌లు త్వరగా కోలుకోవడానికి మేక పాలు తీసుకోవడం చాలా ముఖ్యం.



**4. కివీ ఫ్రూట్** డెంగ్యూ పేషెంట్ కివీ పండును ఆహారంలో తీసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది శరీరంలో రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అంతేగాక ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది.

**5. వేప ఆకులు :** వేప ఆకులలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ఇవి వైరస్‌ల వృద్ధిని, వ్యాప్తిని అరికట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. డెంగ్యూ చికిత్సలో ప్రకృతి సిద్ధమైన ఔషధంగా వేప ఆకులు పనిచేస్తాయి.

## యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షనా..?

### జీవనశైలి మార్పులతో నిరోధించుకో..!



మూత్రనాళంలోని ఏదైనా ప్రాంతంలోకి హానికరమైన బ్యాక్టీరియా ప్రవేశించినప్పుడు యూరినరీ ఇన్ఫెక్షన్ గురవుతుంటారు. మహిళల్లో ఈ సమస్య సర్వసాధారణంగా కనిపిస్తుంటుంది. ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారిలో పొత్తి కడుపులో మంట, మూత్రం రంగు మారటం, వెంటవెంటనే మూత్రానికి వెళ్ళటం వంటి లక్షణాలు కనపడతాయి. వెన్నెముక, పొత్తికడుపు కింది భాగంలో నొప్పి కనిపిస్తుంది. పరిశుభ్రత లోపించడం అనేది ప్రధాన కారణమైనప్పటికీ యాంటీ బయోటిక్స్ అధికంగా వాడటం, మూత్రపిండంలో రాళ్లు వంటి వాటితో కూడా యూటీఐ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొన్ని రకాల జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా యూటీఐ సమస్యను నిరోధించవచ్చునని సెలవిస్తున్నారు వైద్య నిపుణులు. ఈ సమస్యను ఎదుర్కొంటున్నవారి శరీరం డీహైడ్రేట్ అవుతుంది. ఎక్కువ మొత్తంలో నీరు తాగడం ద్వారా శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి బ్యాక్టీరియాకు తక్కువ అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. అలాగే ట్రాక్ట్‌లో బ్యాక్టీరియా ఉండకుండా ఎప్పటికప్పుడు మూత్రం ద్వారా బయటకు పంపుతుంది. అందుకని రోజులో కనీసం మూడు లీటర్లకు తక్కువ కాకుండా ద్రవాలు తీసుకోవాలి. కొబ్బరి నీరు మరీ మంచిది. బియ్యం నీరు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించేందుకు సాయపడుతుంది. యూటీఐ సమస్యతో బాధపడుతున్న వారు హై ఫైబర్ ఉన్న ఆహారాలను తీసుకోవడంపై దృష్టిసారించాలి. అధిక ఫైబర్ ఫుడ్స్ సహజంగా మూత్రాశయం, మూత్రనాళాలను శుభ్రపరుస్తుంది. తద్వారా యూటీఐ సమస్యను నిరోధించుకోవచ్చు. అలాగే మలబద్ధకం సమస్యను కూడా నివారించుకోవడంలో సాయపడతాయి. నిత్యం దాదాపు 25 గ్రాముల ఫైబర్ కలిగిన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, చిక్కుళ్లు తినడం అలవాటు చేసుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం ద్వారా యూటీఐ సహా అనేక రకాల ఆరోగ్య పరిస్థితులను నివారించుకోవచ్చు. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం ద్వారా యూటీఐ ప్రమాదాన్ని తగ్గించేందుకు సాధారణ వ్యాయామాల్ని ఎంచుకోవాలి. శరీర ఉష్ణోగ్రత పెరిగిన సందర్భాల్లో ఈ సమస్య కూడా పెరుగుతుంది. క్రమం తప్పకుండా చేసే వ్యాయామాలతో మూత్రాశయం బలపడి మూత్ర విసర్జన చేసే సమయాన్ని తగ్గిస్తుంది. కొన్ని రకాల ఆహారాలు, పానీయాలు మూత్రనాళానికి చికాకు కలిగిస్తుంటాయి. ఇవి కూడా యూటీఐకి కారణమవుతుంటాయి.

యూటీఐని ప్రేరేపించే ఆహారాలు, పానీయాలను దూరం పెట్టడం చాలా మంచిది. ముఖ్యంగా మసాలా ఆహారాలు, సిట్రస్ పండ్లు, కెఫిన్, బీర్, రెడ్ వైన్, ఇతర ఆల్కహాల్ పానీయాలను దూరం పెట్టాలి.

## వయసు పెరుగుతున్న కొద్దీ పీరియడ్స్‌లో మార్పులు.. ఇలా కనిపెట్టండి



మహిళల్లో పీరియడ్స్ రావడం సహజం. ఈ పీరియడ్స్ క్రమం తప్పకుండా వస్తే అది వారి ఆరోగ్యాన్ని సూచిస్తుందని చెప్పాలి. అయితే, పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం, ఆలస్యం అవడానికి చాలా కారణాలుంటాయి. మహిళల వయసు పెరుగుతున్న కొద్దీ రుతుస్రావ చక్రంలో మార్పులు కనిపిస్తుంటాయి. వయసు పెరిగాక పీరియడ్స్ క్రమబద్ధతలో మార్పు కనిపిస్తూ ఉంటుంది. రక్తస్రావం క్రమరహితంగా కావడం, ఎక్కువ రోజుల పాటు రక్తస్రావం జరుగడం వంటి వాటిని గుర్తించి అర్థం చేసుకునేందుకు పీరియడ్స్‌ను ట్రాక్ చేస్తుండాలి.చాలా మంది మహిళలు పెండ్లి తర్వాత ఎంతో కొంత లావెక్కుతుంటారు. ఇది వారి రుతుక్రమాన్ని ప్రభావితం చేస్తుంది. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎక్కువగా ఉన్నవారిలో ఎండోమెట్రియల్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. అయినప్పటికీ, అధిక బీఎంఐ హైపోథాలమస్-పిట్యూటరీ-ఒవారియన్ (హెచ్‌పీఓ) ఆక్సిస్ కార్యాచరణను ప్రభావితం చేస్తుందని సూచించడానికి ఆధారాలు కూడా ఉన్నాయి. అండాల విడుదలకు సహకరించే ఫోలికల్-స్టిమ్యులేటింగ్ హార్మోన్ల స్రావం కోసం ఈ ఆక్సిస్ బాధ్యత వహిస్తుంది.స్ట్రెస్ హార్మోన్స్ పెద్ద వారిలో స్ట్రెస్ హార్మోన్ కార్టిసాల్‌ను శరీరం అధిక స్థాయిలో ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తుంది. ఇది పీరియడ్స్ నడిచే విధానాన్ని శాశ్వతంగా మార్చవచ్చు. కొన్నిసార్లు తేలికపాటి నుంచి తీవ్రమైన తిమ్మిర్లు, భారీ రక్తస్రావం లేదా రెండింటికి కూడా కారణంగా నిలుస్తుంది. ఒత్తిడి హార్మోన్లు నిలిచిపోగానే ఈ సమస్యలు కూడా తగ్గిపోతుంటాయి. అయితే ఈ లక్షణాలను స్థిరంగా, ఎక్కువ కాలం పాటు అనుభవిస్తున్నట్లయితే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి. స్ట్రెస్ హార్మోన్స్ పీరియడ్ బ్లడ్ నాణ్యతను కూడా ప్రభావితం చేస్తాయి. అధిక కార్టిసాల్ స్థాయిలు రక్తం మరింత జిగటగా మారేందుకు సహకరించవచ్చు. ఫలితంగా రక్తం సిరల్లో సులభంగా ప్రవహించదు. ప్రతి నెల క్రమం తప్పకుండా అండం ఉత్పత్తి జరుగనిపక్షంలో గర్భం పొందలేరు. అదే వయసు మహిళల్లో అండాశయాలు అండాల ఉత్పత్తికి సిద్ధమయ్యేందుకు తీసుకునే సమయం తగ్గిపోతుంది. అండాల ఉత్పత్తి క్రమం తప్పకుండా మిస్ అయితే పీరియడ్స్‌పై కూడా ప్రభావం చూపుతాయి. ఓవేరియన్ రిజర్వ్ అనేది స్త్రీ తన అండాశయంలో నిల్వ చేసిన గుడ్ల సంఖ్యను సూచిస్తుంది. అండాశయ నిల్వలు ఎక్కువగా ఉన్న స్త్రీలలో పీరియడ్స్ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. గర్భాశయ ద్రవం ద్వారా ఈత కొట్టే స్పెర్మ్ ఫలదీకరణ బిందువుల కోసం వెతుకుతాయి. గర్భాశయంలో స్పెర్మ్, గుడ్డు కలిసి ఫలదీకరణం చెందడం ద్వారా పిండం తయారవుతుంది. అయితే మహిళ వయసు పెరిగాక ఇలా జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. అంటే.. అండాశయాలు గుడ్లను ఉత్పత్తి చేస్తూనే ఉంటాయి, కానీ అవి ఫలదీకరణం చేయడానికి సరిపోయే అవకాశం తక్కువగా ఉంటుందన్నమాట. అండాల ఉత్పత్తి తదుపరి కాలానికి మధ్య ఉండే సమయమే లూటియల్ దశ. ఈ దశ చివరిలో అండాశయం ప్రొజెస్టెరాన్‌ను విడుదల చేస్తుంది.

ఇది గర్భాశయ గోడను చిక్కగా చేయడమే కాకుండా గర్భాశయాన్ని గర్భధారణ కోసం సిద్ధం చేస్తుంది. షార్ట్ లూటియల్ ఫేజ్ అంటే పీరియడ్స్ సైకిల్ చివరలో గర్భాశయ గోడలో ఎక్కువ రక్తం ఉందని అర్థం. ఇది అసాధారణమైన తిమ్మిర్లను కలిగిస్తుంది. పెద్ద వయసు వారిలో షార్ట్ లూటియల్ దశ వంటి మార్పులను గుర్తించవచ్చు. ఈ మార్పుల గురించి తెలుసుకోవడం ద్వారా ఎక్కువ నొప్పి లేదా క్రమరహిత రక్తస్రావం కలిగిన సందర్భాల్లో వైద్యనిపుణులను సంప్రదించేందుకు వీలు చిక్కుతుంది.

విశ్లేషణలు రచయిత వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే వాటితో పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు: ఎడిటర్

# నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



హిమాయత్ నగర్ (ప్రశ్న న్యూస్) హిమాయత్ నగర్ లోని కామ్రేడ్. యస్.యన్ రెడ్డి భవన్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎచ్ - 1725) నూతన సంవత్సర (2024) డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో గత ప్రభుత్వ అనాలోచిత చర్యలు, ఉద్యోగుల హక్కులపై ఉక్కుపాధం మోపడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కామ్రేడ్. యండి. యూసూప్ మాట్లాడుతు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ చేసిన కృషి ఎంతో గొప్పదని అభివర్ణించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతు ఉద్యోగుల హక్కుల సాధనలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయూస్ యునియన్ చిత్తశుద్ధిగా పనిచేస్తుందని తెలిపారు. సమస్యల సాధనలో ఎన్నో పోరాటాలు చేసిన ఘన చరిత్ర తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కే దక్కుతుందని తెలిపారు. సమయమిచ్చి ఈ కార్యక్రమానికి హజరైన శాసనసభ్యులు సాబంశివరావు, యూనియన్ రాష్ట్ర, జిల్లా, నాయకులకు ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ రాష్ట్ర నాయకులు బాల్ రాజ్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వేణు కుమార్, శాంత్ కుమార్, కే.శ్రీనివాస్ చారి, పి.నర్సయ్య, యం.యాదయ్య, వి. కరుణాకర్, వీరేష్ బాబు, శివానంధం, మధుసూధన్ రెడ్డి, ఐ.అమృత్ రావు, ఆరోగ్యమ్మ, తదితరులు పాల్గోన్నారు.

# 104 సిబ్బంది సమస్యలపై పట్టింపేది.?

- 5నెలల నుండి సిబ్బందికి అందని జీతాలు
- కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి
- కెసిఆర్ ప్రభుత్వం గాలికి వదిలేసింది, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించేనా.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)104ఉద్యోగులకు సుప్రీమ్ కోర్ట్ తీర్పు అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించడం, కాంట్రాక్టు వ్యవస్థ లోకి తీసుకొనుట గురించి.తెలంగాణ రాష్ట్ర%శీ% లో 1350మంది 104ఉద్యోగులు 2008సంవత్సరం నుండి డి. ఏస్. సి. ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్దతిలో జివో నెం:1636 మేమో నెం :20639ల ప్రకారం పూర్తిగా ప్రభుత్వ అధీనంలో (డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెకనిషన్, ఫార్మసిస్ట్, సెక్యూరిటీ గార్డ్, ఏఎన్ఎం) లు గత 16 స%శీ%" చలిచాలని వేతనాలతో సేవలు అందిస్తున్నరు.గత ప్రభుత్వం లో సకాలంలో వేతనాలు చేలించక పోగ 2012 లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన బేసిక్ విధానాన్ని రద్దు చేసి స్లాబుల విధానం ద్వారా వేతనాలు తగ్గించడం వలన ప్రతి ఉద్యోగి సుమారుగా పదివేల నుండి 20వేల వరకు గత పది సంవత్సరాలుగా నష్టపోతున్నారు. కానీ అప్పటి ప్రభుత్వం మమ్మల్ని గుర్తించలేదని 104 ఉద్యోగుల వేతనాలు చెల్లించుటలో ఇప్పటికీ ఏజెన్సీ విధానాన్ని అమలు చేస్తుండటం వలన ఉద్యోగితనం నుండి సుమారు 5% కోతలు విధిస్తున్నారని తెలిపారు. పిఎఫ్ సకాలంలో చెల్లించడం లేదు ఉద్యోగులకు ఎలాంటి హెల్త్ కార్డు ఇవ్వలేదు డీఎస్సీ ద్వారా రోల్ ఆఫ్ రిజర్వేషన్, పవర్ స్టార్ పాయింట్ పద్ధతిలో పూర్తిగా ప్రభుత్వ దినంలోనే పనిచేస్తున్నందున మమ్ములను కాంట్రాక్టు విధానం లోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించే ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాల్సిందిగా కోరుతున్నామన్నారు.

**పరిష్కరించవలసిన సమస్యలు :**

1. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
2. ఉద్యోగులందర్నీ కాంట్రాక్టు వ్యవస్థలోకి మార్చాలి
3. 104 ఉద్యోగులకు హెల్త్ కార్డు మంజూరు చేయాలి
4. 104 ఉద్యోగులను స్థానికత ఆధారంగా సొంత జిల్లాలోనికి క్లియర్ వేకెన్సీ లలో రెడిప్లై చేయాలి
5. పెండింగ్ 5 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలి

## పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) రామంతపూర్ డివిజన్ అభివృద్ధిలో భాగంగా చిన్న చెరువు పూడిక, చెరువు చుట్టూ సుందరీ కరణ చేయాలనీ భరత్ నగర్, శారద నగర్, నెహ్రు నగర్, శాంతినగర్, రామంతపూర్ భగయత్ కాలనీల లో సీసీ రోడ్డు పనులు, స్ట్రాం, వాటర్ డ్రైన్ పనులు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ని కలిసి వినతి పత్రం అందజేసిన రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ త్వరలో రామంతపూర్ డివిజన్లో సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నానని డివిజన్ అభివృద్ధి సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు డివిజన్ సమస్యల పై వినతి పత్రాలు సమర్పించామని డివిజన్ అభివృద్ధికై పాటుపడతామని ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్నారు.ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండారు వెంకట్ రావు, పాల్గొన్నారు.

# కాసులు కనిపిస్తే అక్రమ నిర్మాణాలు కనపడవా.?

- అవినీతి లో టౌన్ ప్లానింగ్ అధికారులు
- నోటీసులు ఇస్తారు చర్యలు తీస్కోరు అంత మామూళ్ల రాజ్యం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న మున్సిపల్ అధికారులు





ప్రజాప్రశ్న

ప్రజాప్రతినిధుల అండతో

అక్రమ నిర్మాణాలు

ప్రజా ప్రతినిధుల పేరుతో నిర్మాణాలు...





కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రాజకీయ నాయకుల మున్సిపల్ అధికారుల కనుసైగల్లో అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయని అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ నేతల, అధికారుల జేబులో కాసులు పడడంతో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయని దినపత్రికల్లో కథనాలు ప్రచురించిన అధికారులకు తెలిపిన నామమాత్రంగ నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తూ అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి వారికి పూర్తిగా సహకరిస్తున్న రాజకీయ నాయకులు, మున్సిపల్ అధికారులు. మీర్పెట్ హెచ్ బి కాలనీ డివిజన్ లో అంబికా వైన్స్ పక్కన, పక్కింటి నెంబర్5-9-52/462 అక్రమ అంతస్తులు, పక్కింటి నెంబర్ 5-9-10/419 కమర్షియల్ దుకాణాలు జరుగుతున్న అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి కూల్చకుండా మౌనంగా ఉన్నందుకు లంచలే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రాజకీయ నాయకులు కను సైగల్లో..

స్థానిక రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ మున్సిపల్ అధికారులకు కావలసినది మూట చెప్పి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న చూసి చూడనట్టు ఉంటున్నారని అనుమతులు లేకుండా భవన నిర్మాణాలే కాకుండా 70 గజాలలో సెల్లార్ నిర్మాణాలు కూడా జోరుగా జరుగుతున్న రోడ్లను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటే అధికారులకు కాసులు కనబడితే అక్రమ నిర్మాణాలు కనపడవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అధికారులు కాసులను నింపుకుంటూ ఫిర్యాదులు వచ్చిన





పట్టించుకోకుండా ఎన్నికల పనిపై ఉన్నామని సమాధానం చెబుతూ అక్రమ నిర్మాణదారులకు ప్రోత్సహిస్తూ కాప్రా సర్కిల్ లో భారీ అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారని స్థానికుల ఆరోపణ. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికంగా ఉండే అధికారులు రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణదారులకు ప్రోత్సహిస్తూ తాము అన్ని విధాలా చూసుకుంటామని తమ కావాల్సింది ముట్ట చెబితే తాము దగ్గరుండి మీ పనిని కానిస్తామని జేబుల్లో కాసులు వేసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులు, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలు భారీగా జరిగిన అధికారులు చూసి చూడనట్టుగా ఉండడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న ఇదే తంతుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎవరు అధికారంలో ఉన్న అక్రమ నిర్మాణాలను అరికట్టలేకపోతున్నారని స్థానిక రాజకీయ నాయకులు మున్సిపల్ అధికారులు మాత్రం వారికి కావాల్సింది అందడంతో అక్రమ నిర్మాణాలు వాళ్ళ కండ్లకు కనపడవు అన్నట్లు చూసి చూడనట్టు అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతుండడం కాప్రా సర్కిల్ లో పరిపాటిగా మారిందని ప్రజలు గుసగుసలు పెడుతున్నారు. మరి ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు,సిబ్బంది పై చర్య తీసుకుంటారో లేదో చూడాలి.

# విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

## - నల్గొండ మెగా జాబ్ మేళాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- అబ్దుల్ కలాం స్ఫూర్తితో జీవితం లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి
- వింగ్స్ ఆఫ్ ఫైర్ ను ఉదహరించిన మంత్రి
- మెగా జాబ్ మేళా జీవితాలను మార్చే కార్యక్రమం
- పాల్గొన్న 127 కంపెనీలు, హాజరైన 9456 విద్యార్థులు, 6680 మందికి ఉద్యోగ కల్పన
- ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు
- మెగాజాబ్ మేళాను ప్రత్యేకంగా పర్యవేక్షించిన కోమటిరెడ్డి



నల్గొండ (ప్రశ్న న్యూస్) విద్యార్థులు ఉద్యోగ సాధనతో ఆగిపోకుండా నిరంతరం నైపుణ్యాలను అందిపుచ్చుకొని జాబ్ క్రియేటర్స్ గా మారాలన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. సోమవారం నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్, టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) మరియు తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్ మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మంత్రి విద్యార్థులకు, నిరుద్యోగులకు మార్గనిర్దేశనం చేశారు. 127 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళా ద్వారా 6680 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఒక నాయకుడిగా నాకు ఎంతో సంతృప్తినిచ్చిన కార్యక్రమమని ఆయన తెలిపారు. ఈ రోజు మెగా జాబ్ మేళాకు 9450 మంది ఉద్యోగార్థులు రాగా అందరికి ఉచిత భోజనం, ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు, కౌన్సిలింగ్ సెంటర్స్ ద్వారా ప్రతీ ఒక్కరు జాబ్ మేళాలో ఉద్యోగం పొందేలా ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఏర్పాట్లు చేశారు మంత్రి కోమటిరెడ్డి. అంతకు ముందు జాబ్ మేళా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసిఆర్ ప్రభుత్వం నిరుద్యోగ వ్యతిరేక నిర్ణయాల మూలంగా తెలంగాణ యువత తీవ్ర ఇబ్బందులు పడ్డారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహించిన ప్రతీ పరీక్ష లీకులు చేసి నిరుద్యోగుల ఉసురు పోసుకుందని ఆయన మండిపడ్డారు. గ్రూప్ -1 స్థాయి పరీక్ష రెండు సార్లు లీక్ అవడం కేసిఆర్ కు నిరుద్యోగుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఆక్షేపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం.. హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల కల్పన కోసం నిరంతరం శ్రమిస్తున్నదని అయన తెలిపారు. యువత ఉద్యోగాలు లేక కుటుంబాలకి భారం కాకుండా ఉద్యోగాలు సాధించాలని మీరు ఏ పోటీ పరీక్షకు ప్రిపేర్ అయినా ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ మీకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని అయన నిరుద్యోగులకు భరోసా కల్పించారు. విద్యార్థులు, యువత ఈ ఉద్యోగ సాధనతో పాటు కమ్యూనికేషన్లు డెవలప్ చేసుకోవాలని సూచించారు. రాబోయే మే నెలలో మరోసారి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈరోజు జాబ్ మేళలో జాబ్ రాకుండా మిగిలినవారికి రాబోయే జాబ్ మేళలో



అవకాశం కల్పిస్తామని అందుకోసం వారికి ఏ విధమైన ట్రైనింగ్ కావలన్న ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. మాపై నమ్మకంతో నల్గొండ లాంటి పట్టణానికి ఉద్యోగ కల్పన కోసం వచ్చిన కంపెనీ మేనేజర్ లకి, రిక్రూటర్లకి నా ధన్యవాదాలు. మహాత్మా గాంధీ యూనివర్సిటీని నెంబర్ -1 యూనివర్సిటీ గా తీర్చిదిద్దుతానన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. అంతకు ముందు మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎంఫీ థియేటర్, ఎగ్జామినేషన్ బిల్డింగ్, ఇంజినీరింగ్ కాలేజీ భవనాలను ప్రారంభించిన మంత్రి యూనివర్సిటీ అభివృద్ధి కోసం 100కోట్లు నిధులను సీఎం గారితో మాట్లాడి మంజూరు చేయించి, త్వరలోనే శంకుస్థాపన చేసుకుందామని తెలిపారు. దేశంలోనే మహాత్మా గాంధీ యూనివర్సిటీ ని నెంబర్ 1 యూనివర్సిటీగా మార్చుతామని మంత్రి ప్రకటించారు.

# ఎమ్మెల్యే మల్లారెడ్డి పేరుతో అక్రమ నిర్మాణాల జోరు

## అధికారులు నోటీసులు ఇవ్వరు, చర్యలు తీసుకోరు, ఓన్లీ మామూళ్లే

- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ డ్యూటీ చేస్తున్నారా.? కాలక్షేపం చేస్తున్నారా.?
- రెండు నోటీసు ఇచ్చి కూల్చివేతలు చేయకపోవడం వెనక లంచాలే కారణమా.?
- దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిందా.?





**నాగారం (ప్రశ్న న్యూస్)** దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అవినీతి అక్రమాలు రాజ్యంమేలుతున్నాయి. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయవలసిన కమిషనర్ సైతం కళ్ళు మూసుకుని డ్యూటీ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పత్రికలలో కథనాలు వచ్చిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ మౌనం వహించడం ఎంతవరకు సమంజసం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంపల్లి చౌరస్తా నుండి కీసర వెళ్లే రహదారిలో 6అంతస్తుల అక్రమ నిర్మాణం జరుగుతున్న అధికారులు ఇప్పటివరకు నోటీసులు ఇవ్వలేదా.? ఇస్తే ఎందుకు కూల్చివేతలు చేయలేదు అంటూ స్థానికులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ముందే మామూళ్ల తో సర్దుకున్న అధికారులకు సమాధానాలు చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కమిషనర్ భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన పుణ్యమా అని జిహెచ్ఎంసి కి రావలసిన ఆదాయం ఆయన జేబులోకి వెళ్లిందన్న ఆరోపణ వినిపిస్తున్నాయి.

### టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ చర్యలు తీసుకోరా.?

దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ నాయకుల వత్తిడి అక్రమ నిర్మాణాలపై మామూళ్లతో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మౌనం వహిస్తున్నరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి రావలసిన ఆదాయం అక్రమార్కులు గండి కొడుతుంటే నిజాయితీగా డ్యూటీ చేయవలసిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అలా చేయకుండా అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా దమ్మాయిగూడ చౌరస్తాలో అక్రమ సెల్లార్లు, అక్రమ నిర్మాణాలు జరిగిన పత్రికలో కథనాలు వచ్చిన ఏసీపీ చర్యలు తీసుకోకుండా మౌనం వహించి అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికి అందిన కాడికి దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అవినీతి రాజ్యామేలుతుందని అధికారుల కనుసైగల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.






ప్రజాప్రశ్న

పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు

దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో..

### మాజీ మంత్రి మల్లారెడ్డి పేరుతో..

మాజీ మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు కొదవ లేకుండా పోయింది. ఆయనకు తెలిసో తెలియకో ఆయన పేరుతో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణదారులు పార్టీల పేరు చెప్పి మల్లారెడ్డి అనుచరులుమంటూ అధికారులు బెదిరించి ఇలా అనుమతులకు విరుద్ధంగా ఆకాశాన్ని తాకేలా అక్రమ నిర్మాణాలు చేయడం విడ్డూరంగా మారింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి పేరుతో మంచి కార్యక్రమాలు చేయాలి కానీ అవినీతి అక్రమాలు చేయడం సిగ్గు చేటుగా మారింది. దానికి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి మౌనం వహించడం ఆయనకే తెలియాలి. ఎమ్మెల్యే పేరు పైన జరుగుతున్న అవినీతి అక్రమాలను కట్టడి చేయవలసింది పోయి మౌనంగా ఉంటున్నారంటే వాటిని ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రోత్సహిస్తున్నారా.? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### చర్యలు తీసుకుంటాం..

దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కు కొత్తగా వచ్చిన కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి అక్రమ నిర్మాణం పై వివరణ కోరగా పత్రికలో కథనం వచ్చిందని దానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేయడం జరిగింది కాబట్టి ఉన్నత అధికారుల అనుమతి తీసుకుని కూల్చివేతలు చేస్తామని తెలిపారు.

# బొబ్బిలిలో రైల్వే స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన

**బొబ్బిలి** అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ ఆధునీకరణకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, రైల్వే చీఫ్ ఇంజినీర్ పాండే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి రైల్వే స్టేషన్ ఆధునీకరణ చేయడం సంతోషదాయకమన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో మూడు స్టేషన్లు ఆధునీకరణ జరుగుతుందన్నారు. అండర్ బ్రిడ్జిలో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరారు. కాశీ వెళ్లేందుకు వారాణసి ఎక్స్ ప్రెస్ రైలు వేపించామని చెప్పారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ రూ.16కోట్లతో ఆధునీకరణ చేయడం శుభపరిణామమన్నారు. చరిత్రాత్మక బొబ్బిలి అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కొన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లకు బొబ్బిలిలో హాల్ట్ కల్పించేందుకు ఎంపీ పని చేశారన్నారు. గుంటూరు–రాయగడ ఎక్స్ ప్రెస్ రైలు టైమింగ్స్ మార్చాలని రైల్వే అధికారులను కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లలో 554 రైల్వే స్టేషన్లు ఆధునీకరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్ని రంగాలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైల్వే ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, కవితల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# రాబోయే రోజుల్లో పిల్లలు కోడింగ్ నేర్చుకోవాల్సిన అవసరం ఉండదు

- జాబ్ మార్కెట్‌పై ఏఐ ప్రభావం ఉంటుంది
- ఎన్విడియా సీఈవో జెన్సన్ హువంగ్

**న్యూ ఢిల్లీ :** 2022 నవంబర్‌లో ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీని లాంఛ్ చేసిన సమయంలో ఏఐ చాట్‌బాట్ సామర్థ్యాలకు ఫిదా అయ్యారు. లేటెస్ట్ టెక్నాలజీ హాట్ డిబేట్‌గా మారింది. చాట్‌జీపీటీతో జనరేటివ్ ఏఐ నూతన శిఖరాలకు చేరడంతో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సైతం తమ సొంత చాట్‌బాట్స్‌ను క్రియేట్ చేశాయి. భవిష్యత్ ఏఐదే అని తేల్చేశారు. బిల్ గేట్స్, సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్, సాం అల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు జాబ్ మార్కెట్‌పై ఏఐ ప్రభావాన్ని పసిగట్టారు.అయితే ఏఐ పలు అవకాశాలను సృష్టిస్తుందని కొందరు చెబుతుండగా, లక్షలాది కొలువులు లేటెస్ట్ టెక్నాలజీ ఫలితంగా కనుమరుగవుతాయని మరికొందరు వాదిస్తున్నారు. ఇక ఎన్విడియా సీఈవో జెన్సన్ హువంగ్ కూడా జాబ్ మార్కెట్‌పై ఏఐ ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు. లేటెస్ట్ టెక్నాలజీతో ఎవరైనా ప్రోగ్రామర్ అవుతారని, రాబోయే రోజుల్లో పిల్లలు కోడింగ్ నేర్చుకోవాల్సిన అవసరం ఉండదని హువంగ్ చెప్పుకొచ్చారు.ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను అలవరుచుకునేలా చేయాలని పిలుపు ఇచ్చారు.

ఓ దశాబ్ధం కిందట ప్రతి ఒక్కరూ కోడింగ్ నేర్చుకోవాలని చెబుతుండేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని చెప్పారు. ఏఐ రాకతో ప్రతి ఒక్కరూ ప్రోగ్రామరేనని, పిల్లలు కోడింగ్ ఎలా చేయాలని నేర్చుకోవాల్సిన పని లేదని అన్నారు. ప్రోగ్రామింగ్ భాష మానవీయంగా ఉండేలా టెక్నాలజీని క్రియేట్ చేయడం తమ బాధ్యతని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఏం చెప్పదలుచుకున్నారనేది కంప్యూటర్ అర్ధం చేసుకునే క్రమంలో ఇక ఎవరూ సీ++, జావా వంటి కోడింగ్ భాషల అవసరం ఎంతమాత్రం లేదని అన్నారు. ఇది ఏఐ సృష్టించే అద్భుతమని ఆయన ప్రశంసించారు.

# టిక్కెట్ల టెన్షనులో టీడీపీ సీనియర్లు

- సీనియర్లను టెన్షన్ పెడుతోన్న ఐవీఆర్ఎస్ సర్వే

**అమరావతి** పెనమలూరులో దేవినేని, నరసరావు పేటలో యరపతినేని పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే కలకలం రేపుతోంది. అలాగే, – గురజాలలో జంగా కృష్ణమూర్తి పేరుతో సర్వే జరిగింది. సర్వేపల్లి నుంచి పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి పేరుతో తాజాగా ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. రకరకాల పేర్లు తెరపైకి వస్తుండడంతో టెన్షనులో సోమిరెడ్డి వున్నట్లు సమాచారం. ఆనం పేరుతో గతంలోనే మూడు చోట్ల ఐవీఆర్ఎస్ సర్వేలు వచ్చాయి. ఆనం పేరుతో వెంకటగిరి, సర్వేపల్లి, ఆత్మకూరు సెగ్మెంట్లల్లో సర్వేలు వచ్చాయి. తన పేరు ప్రకటించకపోవడంపై కళా వెంకట్రావు అందోళనలో వున్నారు. ఎచ్చెర్ల నుంచి అయన టిక్కెట్ ఆశిస్తున్ఆరు. – దెందులూరు నుంచి చింతమనేనికీ క్లారిటీ రాలేదు. చింతమనేని కుమార్తె పేరుతో దెందులూరులో ఐవీఆర్ఎస్ సర్వే నడిచింది. అనకాపల్లి టిక్కెట్ ఆశించిన పీలా గోవింద్ డైలమాలోనే వున్నారు. – బండారు సత్యనారాయణ మూర్తికి క్లారిటి రాలేదు.

# కడప రెడ్లు ఇక్కడికి రావద్దు

**శ్రీకాకుళం** రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కడప నుంచి వచ్చిన రెడ్లు శ్రీకాకుళం జిల్లాలో పెత్తనం చెలాయిస్తానంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శ్రీకాకుళం లో జరిగిన కళింగ కోమట్ల ఆత్మీయ సమావేశంలో ధర్మాన్ని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజా ప్రతినిధులకు ఒక ఆస్తికోసం కక్కుర్తి పడే మనస్తత్వం ఉండకూడదు అన్నారు. ఇటీవల కడప నుంచి సుబ్బారెడ్డి అనే వ్యక్తి వచ్చి భూమి దోచేస్తానన్నాడు. నువ్వు ఎవడవి ఇక్కడ భూమిని దోచేయడానికి తంతా పొమ్మని హెచ్చరించానని ధర్మాన చెప్పారు. వచ్చినవాడు ఏ పార్టీ వాడను చూడను, ఇక్కడకు వచ్చి అజమాయిషీ చేలాయిస్తానంటే అది నన్ను అవమానించినట్టే అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పెద్ద ఎత్తున వనరులు ఉండటంతో పక్క జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చేస్తున్నారని ధర్మాన వ్యాఖ్యానించారు. ఇలాంటి సంస్కృతిని ఇలాగే వదిలేస్తే సమాజం రౌడీలు చేతిలోకి వెళ్ళిపోతుందని అన్నారు.

# సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేందడం సంతోషం

**విశాఖపట్నం** అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 41 వేల కోట్ల రూపాయలతో 554 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జ్ లు, అండర్ పాస్ లను భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విర్చువల్ గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు.. ఈ సందర్భంగా సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు జి. వి.ఎల్. నరసింహం, పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గణబాబు, రైల్వే డి. ఆర్. ఎం. సౌరబ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన నాకు ఈ స్టేషన్ అభివృద్ధి చెందటం సంతోషంగా ఉంది అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో విశాఖపట్నంతో పాటు, సింహాచలం స్టేషన్ కి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చెయ్యడం చాలా ఆనందదాయకం..ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గతంలో ఇక్కడ అనేక అసాంఘిక కార్యకలాపాలు జరుగుతూ ఉండేవి. కానీ నేడు అటువంటివాటికి అడ్డుకట్టవేసి ఆధునీకరణ చేశారని అన్నారు.

# వ్యక్తి దారుణహత్య

**తిరుపతి** తిరుపతి జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తిని అతికిరాతకంగా చంపిన సంఘటన చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా,పాకాల మండలం, రైల్వే కళ్యాణ మండపం సమీపంలో అతికిరాతకంగా గుర్తు తెలియని వ్యక్తిని బండరాయితో తలపై మోది చంపిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.సోమవారం ఉదయం స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పాకాల ఎస్.ఐ ఇషాక్ బాషా,రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గుండెపోటులో ప్రైవేటు టీచర్ మృతి

**బనగానపల్లె** నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట గ్రామంలో పెండేకంటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయురాలి గా పనిచేస్తున్న పూర్ణిమ(39)తరగతి గది నుంచి బయటకు వచ్చి టీ తాగి కుప్పకూలిపోయింది.

వెంటనే ఆమెను హుటాహుటిన పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయురాలు పూర్ణిమ ను వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు ఆమెను పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఆమె మృతి పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# వర్గీకరణకు వ్యతిరేకంగా హలో మాల ఛలో బాపట్ల ని విజయవంతం చేయండి

- రంగయ్య



**కర్నూలు** యస్ సి వర్గీకరణ కు వ్యతిరేకంగా బాపట్ల లో మూడవ తారీకున జరిగే మాలల సింహం గర్జనకు వేలాదిగా మాలలు రాష్ట్ర వ్యాప్తంగా తరలి రావాలని జై భీమ్ మాలమహానాడు రాష్ట్ర నాయకులు సి. రంగయ్య పిలుపునిచ్చారు. ఇటీవలే వర్గీకరణ పై సుప్రీం తీర్పు వాయిదా వేయడం జరిగింది అని కేంద్రం అండదండలతో గతంలో వేసిన కమిషన్లు జడ్జిమెంట్ లను పరిగణలోకి తీసుకోకుండా అత్యున్నత న్యాయ స్థానం ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరం అని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మాలల లో చైతన్యం చేయడానికి మాలమహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు బాపట్ల లో నిర్వహించు మాలల సింహం గర్జన సభ ను వేలాది గా మాలలు తరలి వచ్చి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు మాల మల్లేష్ పరమేష్ తెలిపారు.మందకృష్ణ మాదిగ కేంద్రం అండదండలతో సుప్రీం లో పోరాటం చేస్తే మా మాలలు రాజ్యాంగ బద్దంగా పోరాటం చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా మాలలు పోరాటం చేస్తున్న మల్లెల వెంకట్రావు చెన్నయ్య రామ్ ప్రసాద్ మరింత మందికి ఆర్థికంగా సహరిస్తే మాత్రం తప్పకుండ విజయం సాధిస్తారని యువదళం జిల్లా అధ్యక్షులు నల్లన్న బలరాం రాముడు ఆశభావం వ్యక్తం చేసారు. కర్నూలు జిల్లా తరుపున భారీ ఎత్తున బాపట్ల కు వెళ్తున్నట్లు మాలమహానాడు నాయకులు తెలిపారు కార్యక్రమం లో రాజోలప్ప మల్లేష్ పరమేష్ నల్లన్న బలరాం రాముడు నర్సింహా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మిగనూరులో ఇటుక బట్టీలను సీజు చేసి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని

## జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

**కర్నూలు** కలెక్టర్ ఆఫీస్ నందు నేడు ఎమ్మిగనూరులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు వెలిసిన వాటిని సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చి, ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గంధాలము మణికుమార్ మాదిగ మాట్లాడుతూ...ఎమ్మిగనూరు నియోజకవర్గ,నందవరం మండలం ముగతి,ధర్మపురం గ్రామాలు గుండా మంత్రాలయం పోవు 167 అంతర్జాతీయ రహదారి ప్రక్కన ఆనుకొని,ఇష్టానుసారంగా ఇటుక బట్టీలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ముఖ్యంగా ఎమ్మిగనూరుకు చెందిన రమేష్, బోడబండ అంజిలు ఇటుక బట్టీలు నుండి రోజు అధిక కాలుష్యం వలన టూ వీలర్స్, ట్రాక్టర్లు,ఇతర వాహనాలు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కళ్ళల్లోకి పొగ పోవడం, ఇటుక బట్టీలు మట్టి, వడ్లు పొట్టు, కాలుష్యం కళ్ళల్లోకి పోవడం వలన డ్రైవింగ్ చేసేవారికి ఇబ్బందులుగా మారి,నిరంతరం ప్రమాదాలు జరుగుతూ క్షతగాత్రులు అవుతున్నారు.

# యాకుత్ పురా రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- యాకుత్పురా

తెలంగాణ రాష్ట్రంలోని ఒక ముఖ్యమైన స్టేషన్ అయిన యాకుత్పురా రైల్వే స్టేషన్, రైలు వినియోగదారుల నానాటికీ పెరుగుతున్న డిమాండ్ల అవసరాలను తీర్చే ఉద్దేశ్యంతో అమృత్ స్టేషన్ల పథకం కింద తీసుకోబడింది. కొన్నేళ్లుగా, స్టేషన్లో ప్రయాణికుల రద్దీ మరియు రైళ్ల నిర్వహణలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. యాకుత్పురా ప్రజలకు ఎదుగుతున్న టెర్మినల్గా రూపుదిద్దుకున్న ఈ స్టేషన్ ను "అమృత్ స్టేషన్ స్కీమ్" కింద అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ. 8.53 కోట్లు. దానిలో భాగంగా, ఆధునిక ముఖభాగాన్ని అభివృద్ధి చేయడం, చలామణీ చేసే ప్రాంతాన్ని మెరుగుపరచడం, ట్రాఫిక్ సౌకర్యాల రహిత ప్రవాహం, వెయిటింగ్ హాళ్లను మెరుగుపరచడం మరియు ప్రయాణీకులకు అనుకూలమైన సంకేతాలను అందించడం వంటి వాటితో పాటు దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ను రూపొందించారు. పూర్తయిన తర్వాత, స్టేషన్ అమృత్ స్టేషన్ కింద అమలులో ఉన్న అప్గ్రేడేషన్ ప్లాన్ల సౌజన్యంతో క్లాస్ మరియు కంఫర్ట్ కొత్త గరిష్ఠ స్థాయిని అనుభవించడానికి సిద్ధంగా ఉంది.

# వేదవ్యాస్‌ను కలిసిన కాగిత కృష్ణ ప్రసాద్

**మచిలీపట్నం** మచిలీపట్నంలో మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ను కాగిత కృష్ణ ప్రసాద్ కలిసారు. వేదవ్యాస్ మాట్లాడుతూ కాగిత కృష్ణ ప్రసాద్ నన్ను కలిసి మద్దతు కోరారు. మద్దతు ఇస్తానని చెప్పాను. కార్యకర్తలతో మీటింగ్ ఏర్పాటు చేసి నా తదుపరి కార్యాచరణ రెండు రోజుల్లో వివరిస్తాను.నిన్న బాడిగ రామకృష్ణ నన్ను కలిసి వైసీపీలోకి ఆహ్వానించినట్టు వస్తున్న ప్రచారం సరైనది కాదు. మా అధినాయకుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తో కలిసిన తర్వాత నా తదుపరి కార్యచరణ ప్రకటిస్తానని అన్నారు.

# ఈనెల 29న ఢిల్లీ రాంలీలా మైదానంలో భారత భగీరథ జన కల్యాణ యాత్ర

**ఎమ్మిగనూరు** కర్నూలు జిల్లా భగీరథ ఉప్పర/సగర సంఘం ఆధ్వర్యంలో సగరులు బయలుదేరి వెళ్లారు. దేశమంతా సగరులను ఒకే పేరుతో పిలవాలని,సగరులను కూడా రాజకీయంగా గుర్తించాలని ఢిల్లీ వేదికగా వీరు నినదించనున్నారు. భారతదేశంలో సగరులు 20 నుండి 25 కోట్ల మంది దాకా ఉన్నా సగరులకు ఎక్కడా రాజకీయ ప్రాతినిధ్యం లేదు. అరిచే వాడిది, కర్ర ఉన్నవాడిదే పెత్తనం అన్నట్లుగా ఉంటున్న సందర్భంలో మేము సైతం అంటూ వీరు హస్తిన వేదికగా పోరాటానికి సిద్ధమయ్యారు.భారతదేశం నలుమూలల నుండి ఈనెల 29న లక్షలాది మంది సగరులు హాజరయ్యే ఢిల్లీ రాంలీలా మైదానం సభకు చేరుకొని తమ హక్కుల కోసం వీరు నినదించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సగరులు ఉన్నా రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని, ఓట్లు వేయడానికి తప్ప రాజకీయాలకు పనికిరామా అని వీరు ప్రశ్నిస్తున్నారు. ఇంకా మమ్మల్ని గుర్తించకపోతే ఇక సాగదు, సహించమని సగరులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి దాదాపు 100 మంది దాకా ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో కర్నూలు జిల్లా భగీరథ ఉప్పర సగర సంగం జిల్లా అధ్యక్షుడు బి.సత్యన్న, ప్రధాన కార్యదర్శి యూకే వీరేంద్ర, సంఘం నాయకులు ఏపీ వీరన్న, రామచంద్ర, ఎమ్మిగనూరు సగర సంగం ప్రెసిడెంట్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యుకె రాజు, సంగం మాజీ అధ్యక్షుడు డి రాముడు తదితరులు ఉన్నారు.

## కోర్టు తీర్పు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నా

ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కుట్ర చేస్తోందని అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులూ ఇదే విధంగా ఆరోపించారు. కొంత మంది ఆప్ నేతలకు బీజేపీ నుంచి మెసేజ్‌లు వచ్చాయని అన్నారు. బీజేపీలో చేరకపోతే ఈడీ, సీబీఐతో దాడులు చేయిస్తామని బెదిరిస్తున్నట్టు చెప్పారు. గతేడాది నవంబర్ నుంచి విచారణకు హాజరు కాకుండా దాటవేస్తూ వస్తున్నారు అరవింద్ కేజ్రీవాల్. మార్చి 16వ తేదీన నేరుగా కోర్టులో హాజరు కావాలని ఆదేశాలందాయి. అందుకు కేజ్రీవాల్ అంగీకరించారు. గతంలో బడ్జెట్ సమావేశాలున్నందున విచారణకు హాజరు కాలేకపోయామని తెలిపారు. ఈడీ ప్రకారం ఎక్సైజ్ పాలసీని ఫైనలైజ్ చేసేందుకు ఆప్ రూ.100 కోట్ల లంచం తీసుకుంది. గోవా ఎన్నికల్లో ప్రచారం కోసం ఈ డబ్బుల్నే వినియోగించారని ఆరోపిస్తోంది ఈడీ. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్ అరెస్ట్ అయ్యారు.

# కేసీఆర్ నాట్ రీచబుల్

సభలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మనుగడ సంపాదించుకున్నారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో కథమొత్తం రివర్స్ అయ్యిందని తెలుస్తుంది.దీంతో త్వరలో ఎన్నికలు జరగనున్న ఏపీ నుంచి, మహారాష్ట్ర నుంచీ బీఆరెస్ నేతలు కేసీఆర్ కు టచ్ లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారంట. ప్రధానంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనుండటంతో ఏపీలో బీఆరెస్ నేతలు పోటీ, ప్రచారం మొదలైన విషయాలపై మాట్లాడాలని కాల్స్ చేస్తుంటే కేసీఆర్ నుంచి స్పందన కరువవుతుందని అంటున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఏపీలో పోటీ విషయంలో కేసీఆర్ కాడె దింపేయడమే దీనికి కారణం అని అంటున్నారట అయినవారు. వాస్తవానికి ఇప్పుడు ఏపీలో బీఆరెస్ కి ఒక ఆఫీసులో, అందులో తోట చంద్రశేఖర్ తప్ప ఇంకెవరూ, ఇంకేమీ లేవనే మాటలు వినిపిస్తున్నాయి. ఈయన కూడా ఈ రోజో రేపో కారు దిగిపోతారని కథనాలొస్తున్నాయి. ఇక, ఆ పార్టీ నేత రావెల కిషోర్ బాబు చాలా రోజుల కిందటే వైసీపీలో జాయిన్ అయిపోయారు. మరోపక్క మహారాష్ట్రలో ఇప్పటికే చాలామంది నేతలు కారు దిగిపోయారని అంటున్నారు. ఈ సమయంలో పార్టీలో ఉన్నవారంతా వాట్ నెక్స్ట్ అనే విషయంపై ఫోన్ చేయాలని భావించి కేసీఆర్ కి ఫోన్ చేస్తుంటే "యూ ఆర్ ట్రయింగ్ టు కాల్ ఈజ్ నాట్ రీచబుల్" అని వస్తుందంట! ఇలా ఎంతకాలం అని ఆలోచిస్తున్నవారికి "కాల్ ఆఫ్టర్ తెలంగాణ లోక్ సభ ఎలక్షన్స్" అని అనధికారిక సూచన అందుతుందని తెలుస్తుంది. కారణం తెలంగాణ లోక్ సభ ఎన్నికల్లో వచ్చే ఫలితాలపైనే కేసీఆర్ ఫ్యూచర్ ప్లాన్స్ ఆధారపడి ఉంటాయని అంటున్నారు.

# ఏళ్లుగా తిష్టవేసిన అధికారులను బదిలీ చేయాలి

నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకుపైగా చెల్లించేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు రాకపోవడంతో రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కలు తేడాలు ఉంటున్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే బిల్లులు కచ్చితంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### కేసుల పురోగతిపై నివేదికకు ఆదేశాలు

నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు.

### ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం

హైదరాబాద్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులపై కంకర కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని పేర్కొన్నారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

వే బిల్లులతో పాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వవద్దని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగానూ పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విధించిన జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలు ఏమిటో తెలియజేయాలని, దానిపై నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు.

టీఎస్ ఎండీసీతో పాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలున్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కుప్పం కేంద్రంగా సీఎం జగన్ కీలక ప్రకటన

నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. కుప్పం ప్రజల మంచితనానికి జగన్ హ్యాట్సాఫ్ చెప్పారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే ఒక్క స్కీమ్ ఐనా ఉందా అంటూ ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎం గా ఉండి ఏ ఒక్క ఇంటికైనా మంచి చేశారా అని నిలదీసారు.

### మంచి చేస్తే పొత్తులెందుకు

చంద్రబాబు మంచి చేసి ఉంటే పొత్తులెందుకని ప్రశ్నించారు. కాపులకు చంద్రబాబు చేసిన మంచి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేసారు. దత్తపుత్రుడుతో నాలుగు గోడల మధ్య ప్యాకేజీల గురించి చర్చలు చేస్తారని విమర్శించారు.

రంగాను హత్య చేయించింది ఎవరో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. బీసీ సీట్ల పైన డబ్బుతో చంద్రబాబు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. బీసీ వర్గానికి చెందిన భరత్ ను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే మంత్రిని చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. కేవలం అవసరానికి వాడుకుని వదిలేసే చంద్రబాబు ఎందుకో ఆలోచించాలన్నారు. ప్రజలను మోసం చేయడానికి రంగుల మేనిఫెస్టో తో వస్తారని అలర్ట్ చేసారు. కుప్పంకు తన హయాంలో జరిగిన మేలును జగన్ వివరించారు. కుప్పంకు కృష్ణమ్మ నీరు కుప్పాన్ని మున్సిపాలిటీగా కుప్పానికి రెవెన్యూ డివిజన్ తెచ్చింది తన హాయంలోనే అని చెప్పారు.

### బీసీ నియోజకవర్గంలో పెత్తనం

కుప్పంలో కేవలం 31 వేల మందికి మాత్రమే చంద్రబాబు పెన్షన్ ఇచ్చారని గుర్తు చేసారు. రూ. 3 వేలకు పెన్షన్ పెంచి 45,374 మందికి పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేస్తామని చెప్పి చేసి చూపించామన్నారు.

కృష్ణా జలాల నిల్వ కోసం మరో రెండు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని జగన్ వెల్లడించారు. అందుకోసం పరిపాలన పరమైన అనుమతులు కూడా ఇచ్చామని చెప్పారు. కుప్పంలో తాము గెలవకపోయినా మిమ్మల్ని ఏనాడూ విమర్శంచలేదని, మీరంతా నావాళ్లేనని గర్వంగా చెప్పుకున్నానని జగన్ పేర్కొన్నారు.

ఈ నెలలోనే కుప్పంలో మరో 15 వేల ఇళ్ల పట్టాలు ఇవ్వబోతున్నట్లు జగన్ ప్రకటించారు. బీసీ సీటును కబ్జా చేసి ధన బలంతో 35 ఏళ్లుగా రాజ్యమేలుతున్నారని విమర్శించారు. పేదల భవిష్యత్ బాగుండాలంటే తన ప్రభుత్వానికి మద్దతివ్వాలని జగన్ కోరారు.

# ఏపీలో తొలి గ్యారెంటీని ప్రకటించిన షర్మిల

చెప్పారు. "కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి పునాదులు వేసింది. మెట్టు మెట్టు కట్టుకుంటూ నిర్మాణం చేసింది. ఇదే కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రం కోసం ఒక గ్యారెంటీ ఇస్తోంది. అదే ఇందిరమ్మ అభయం ఇంటింటికీ 5 వేలు చొప్పున అందిస్తాం. పేద కుటుంబాలు నిర్భయంగా బతికేందుకే ఈ పథకం పేదరిక నిర్మూలన కోసం ఇందిరమ్మ అభయం అసమానతలు తొలగింపు కోసం ఈ నూతన ఆలోచన. ప్రతి ఇంటికి అండగా నిలబడేది ఇందిరమ్మ అభయం ఇంటికి దైవం ఇల్లాలు. అందుకే మహిళలకు ఈ గ్యారెంటీ మహిళ పేరు మీదనే చెక్కు ఇస్తాం." అని వైఎస్ షర్మిల ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పదేళ్లలో పది అడుగులు కూడా ముందుకు వెళ్లలేదని షర్మిల విమర్శించారు. చంద్రబాబు, జగన్ పాలనలో 25 ఏళ్లు వెనక్కి వెళ్ళిందని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి లో దూసుకుపోతున్నాయన్న షర్మిల ఏపీని అభివృద్ధిలో వెనక్కి నెట్టిన ఘనత చంద్రబాబు,జగన్‌దని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు, వైఎస్ జగన్ ఇద్దరూ మోసం చేశారన్న షర్మిల అధికారం అనుభవించి ఊసరవెల్లిలా రంగులు మార్చారని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా రాకపోవడానికి చంద్రబాబు, జగన్ ఇద్దరూ ద్రోహులేనని అన్నారు. అనంతపురం సభలో సీఎం వైఎస్ జగన్ మీద కూడా షర్మిల విమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పక్షాన ఆందోళన చేస్తుంటే నన్ను ఈడ్చి పడేశారని అన్నారు. వైఎస్సార్ జలయజ్ఞం ప్రాజెక్ట్ లో 54 ప్రాజెక్ట్ లు కడితే.. ఐదేళ్లలో జగన్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పక్షాన ప్రశ్నిస్తుంటే చెల్లెలు అని కూడా చూడకుండా తనపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. డబ్బులు పోసి సోషల్ మీడియా ద్వారా ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారని అన్నారు. "ఒకప్పుడు ఇదే చెల్లెలు 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేసింది. రాష్ట్ర హక్కుల కోసం ఇదే చెల్లెలు ఉద్యమం చేసింది బై బై బాబు అంటూ ఉద్యమం చేసింది. మీకోసం ఇదే చెల్లెలు ఇంత కష్టం చేస్తే నా మీద, నా భర్త మీద నిందలు వేస్తున్నారు. మీరు ఏం చేస్తున్నదీ దేవుడు చూస్తున్నాడు. ఎన్ని నిందలు వేసినా వైఎస్సార్ బిడ్డ భయపడదు ఆంధ్ర రాష్ట్ర హక్కులు సాధించే వరకు వైఎస్సార్ బిడ్డ ఇక్కడ నుంచి కదలదు." అని షర్మిల స్పష్టం చేశారు.

## రెండో రోజే కొట్టుకుపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జి

చేపట్టింది. జనవరి మొదటి వారంలో ఈ పనులు చేపట్టి వేగంగా పూర్తిచేసింది. అయితే ప్రారంభించిన రెండో రోజే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ తెగిపోవటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్కే బీచ్‌కు వచ్చిన సందర్శకులు సైతం దీనిపై మండిపడ్డారు. మరోవైపు ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణ సమయంలోనే కొంతమంది నిపుణులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్కే బీచ్‌లో అలల తీవ్రత ఎక్కువని, తేలియాడే ఫ్లోటింగ్ బ్రిడ్జిలు కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు దారితీయవచ్చనే అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే ప్రారంభించిన రెండో రోజే ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేకపోయారు. ఈ నేపథ్యంలో హడావుడిగా ఏర్పాటు చేయాలన్న తపనే తప్ప భద్రతాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.

# ఒక్కొక్కరికి కోటి భీమా

న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు.

### - 7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి తెలంగాణ

2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కానీ రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు తమ వంతు పాత్ర పోషించారని కొనియాడారు. గత 10 ఏళ్లు సింగరేణి కార్మికులకు సరైన న్యాయం జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు రాష్ట్రాన్ని దివాళా తీయించిందని విమర్శించారు. ఉద్యోగులకు ఒకటో తేదీన ఇవ్వాల్సిన జీతాలను, 25వ తేదీ వరకు విడతల వారీగా చెల్లించిన ఘనుడు కేసీఆర్ అని సెటైర్లు వేశారు. తాము అధికారంలోకి వచ్చాక మొదటి నెల 4వ తేదీన, రెండో నెల ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు చెల్లించామని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు బంధు మార్చి 31లోగా దశలవారీగా చెల్లిస్తాం. ఫైనాన్షియల్ ఇయర్ సమయంలో ఉద్యోగులకు వేతనాలు, సంక్షేమ పథకాలకు నిధులు ఇబ్బంది అవుతుందని కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టకుండా గత ప్రభుత్వం మోసం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కారుణ్య నియామకాలకు నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు. శాసనసభలో కేటీఆర్, హరీష్ రావు, శాసన మండలిలో కవిత, బహిరంగ సభలలో కేసీఆర్ ఈ నలుగురి గోస తప్పా తెలంగాణ ప్రజలకు ఏ ఇబ్బంది లేదన్నారు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి వదిలేస్తే కోర్టు పరిధిలో ఉన్న వాటికి న్యాయ పరిష్కారం చూపించి 25 వేల ఉద్యోగులకు నియామక ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు. గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు ఆ సమస్యలను పరిష్కరించలేదని హరీష్ రావును సీఎం రేవంత్ ప్రశ్నించారు. స్టాఫ్ నర్స్, పోలీసులు నియమాకాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

### 43 వేల మంది కార్మికులకు లబ్ది: భట్టి విక్రమార్క

43 వేల మంది కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా పథకం వర్తిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా రూ.40 లక్షల బీమా పథకం అమలు చేస్తామన్నారు. సింగరేణి కార్మికులకు మొత్తంగా రూ.1.20 కోట్ల పరిహారం అందుతుందని ఆయన స్పష్టం చేశారు. కోటి రూపాయల ప్రమాద బీమా పథకం ఇప్పటివరకు సైనికులకు మాత్రమే ఉందని, ఇప్పుడు సింగరేణి కార్మికులకు అంత మొత్తంలో ప్రమాద బీమా అమలు చేస్తున్నామని సింగరేణి ఎండీ బలరామ్ అన్నారు. పెద్ద మొత్తంలో సింగరేణి కార్మికులకు బీమా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు.

# ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు
## : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ఓయూ (ప్రశ్న న్యూస్) విద్యార్థి, నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార ప్రసారాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికై త్వరలోనే వైస్ చాన్సలర్లతో ప్రభుత్వం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇరిగేషన్, ఆర్థిక, విద్యుత్ శాఖలపై విడుదల చేసినట్లుగానే త్వరలోనే ధరణిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీకన్స్ట్రక్షన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఎమర్జింగ్ ఇష్యూస్, పాలసీ ఇంటర్వెన్షన్స్ అండ్ డెవలప్మెంట్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 వేల ఉద్యోగాలను ఇప్పటికే భర్తీ చేశామని, త్వరలోనే 11 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. వచ్చే నెల 2న వివిధ విభాగాలకు చెందిన ఆరు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని అంటుంటారని, అలా అయితే రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రగతిభవన ను ప్రజాభవన్ గా మార్చి సామాన్యులు కూడా ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులను కలిపే విదంగా తాము పనిచేస్తున్నామన్నారు. రెవెన్యూశాఖ, ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో రెండు లక్షల 45 వేల ఫిర్యాదులతో దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, నెల ఒకటో వారంలో వాటి పరిష్కారం ఉంటుందని తెలిపారు. దీనికి ఎమ్మార్వో స్థాయిలో సదుస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కీలక ఉపన్యాసకులుగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ప్రజాస్వామ్యం, ఆత్మగౌరవం కోరుకున్నారని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ మార్పు జరిగిందని చెప్పాడు. సామాజిక ఉద్యమాలు, సామాజిక మార్పు, ప్రజాస్వామిక ప్రక్రియతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సు తెలంగాణ ప్రగతికి దోహదపడుతుందని ప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ప్రముఖ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, సదస్సు డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఓయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె. అర్జున్రావు, సోషియాలజీ విభాగం బీవోఎస్ చైర్మెన్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ రామ్ బీనవేణి సెఫర్డ్.. సిద్దార్థ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నాగయ్య, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ చెన్న బసవయ్య. డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వరూపానందేంద్ర ఆశీస్సులు
# అందుకున్న వైవీ సుబ్బారెడ్డి



**విశాఖపట్నం** రాజ్యసభ సభ్యులుగా నూతనంగా ఎంపికైన సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి సోమవారం విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాముల ఆశీస్సులు అందుకున్నారు. రాజ్యసభ సభ్యుని హోదాలో కార్యదక్షతతో పనిచేసేలా దీవించమని పీఠాధిపతులను వైవీ సుబ్బారెడ్డి కోరారు. అమ్మవారి అనుగ్రహంతో శక్తవంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

## జగ్గంపేటలో జనసైనికులుఅసమ్మతి సెగలు

**జగ్గంపేట** జగ్గంపేట జనసేన లో ఉదాసీనత నెలకొంది. రెండు రోజుల్లో అధిష్టానం నుండి ఏవిధమైన పిలుపు రాకపోతే జగ్గంపేటలో జనసేన ఖాళీ చేసేందుకు జనసేన కార్యకర్తలు సిద్ధంగా వున్నారు. నియోజకవర్గంలో రోజురోజుకు సమీకరణాలు మారుతున్నాయి. అచ్యుతాపురం లో పవన్ కళ్యాణ్ తీరుపై జనసైనికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకుడికి అభ్యర్థి గా ప్రకటించకపోవడంతో తీవ్ర అసంతృప్తి లో ఉన్నారంటూ పవన్ కు అల్టిమేటం ఇచ్చారు. దీక్షకు దిగి రెండవరోజు గడుస్తున్న హైకమాండ్ స్పందించకపోవడం పై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరో నలభై ఎనిమిది గంటల్లో పార్టీ అధిష్టానం నుండి పాఠంశెట్టి సూర్యచంద్రం పై పవన్ స్పందించక పోతే జగ్గంపేట లో జనసేన పార్టీకి రాజీనామా చేస్తామంటూ హెచ్చరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ నాకు దేవుడు.. నేను పార్టీకోసమే అహర్నిశలు పనిచేసాను. నేను ఆత్మహత్య చేసుకొను..కానీ అంతిమ ఆమరణ నిరాహారదీక్ష మాత్రమే చేస్తాను...పోలీసులు నాకు సహకరించాలంటు పాఠంశెట్టి సూర్యచంద్ర విన్నవించారు.

## హుస్నాబాద్‌లో మంత్రి పొన్నంపర్యటన

**సిద్దిపేట** హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. రేపటి నుండి 500 కే గ్యాస్ పథకం అమలవుతుండడంతొ మహిళలతో కలిసి గ్యాస్ సిలిండర్ కి పూలు వేసి శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేసారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీముల్లో భాగంగా మహిళలకు 500 రూపాయల గ్యాస్ సిలిండర్ పథకాన్ని , 200 సునీట్ల ఉచిత విద్యుత్ పథకం కార్యక్రమం లాంఛనంగా మా నాయకురాలు ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి, మంత్రులందరం కలిసి ప్రారంభిస్తున్నామని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాగ్దానాలు అన్ని నెరవేరుస్తున్నాం. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరుతున్నాం. రాజకీయంగా విమర్శలు, ప్రతి విమర్శలు ప్రజాస్వామ్య పద్ధతి లో చేసుకోవాలి. మేము ఇచ్చిన హామీలు వంద రోజులు కూడా పూర్తికాకముందే ప్రేరేపితమైన మాటలు ప్రభుత్వాలు కూలగొడతామనే మాటలు మాట్లాడుతూ ప్రజలను కన్ఫ్యూజ్ చేసే పద్ధతిలో వ్యవహరిస్తున్నారు. అది మంచి పద్ధతి కాదు. మేము ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రభుత్వం వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ రవాణా సౌకర్యం , ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంచినం. ఈరోజు మహిళలకు 500 రూపాయల కే సిలిండర్ అందిస్తుండడం మహిళల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు.మహిళలు వారి కార్యక్రమాలను విస్తృతపరచుకుంటున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దేవాలయాలకు, హాస్పిటలకు ఉచితంగా స్వేచ్ఛగా వెళ్తున్నారు. ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న బండి సంజయ్ ని అడుగుతున్నానని అన్నారు మీ ప్రభుత్వం 500 కే సిలిండర్ ఇవ్వగలుగుతుందా...? 500 సిలిండర్ 1200 కు పెంచారు మీరు ఏం జవాబు చెబుతారు..? కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో బండి సంజయ్ చెప్పాలి. 5 సంవత్సరాలు ఎంపీగా ఉండి ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న మాట్లాడకుండా ఎన్నికలు వస్తున్నాయని రామాలయం పేరు మీద ఓట్లు అడిగితే కాదు. మతపరమైన అంశాలతో ఓట్లు అడగడం కాదు, ప్రజాస్వామ్యతంగా ఓట్లు అడగాలి. తెలంగాణకు బిజెపి ఏం చేసిందో చెప్పాలి బండి సంజయ్ పార్లమెంట్ సభ్యుడిగా ఏం కొట్లాడారు. తెలంగాణ అక్కచెల్లెళ్లకు శుభాకాంక్షలు చెబుతున్న. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బిజెపి ప్రజాహితం పేరిట యాత్రలు చేస్తోందని అన్నారు.

## అంబాజీపేట విద్యుత్ సబ్స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

**అంబాజీపేట** అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట విద్యుత్ సబ్స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన దిగారు. రైతుల ఉచిత విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టడం నిరసించారు. పొలాల్లో మోటార్లకు స్మార్ట్ మీటర్లు వల్ల ఉపయోగం లేదని అంటున్నారు.

రైతులకు ఇస్తున్న ఉచిత కరెంట్ బిట్ బిట్లుగా కాకుండా ఒకేసారి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేసారు. వేసవి సమీపిస్తుండడంతో కొబ్బరి తోటలకు నీరు అవసరం ఉంటుందన్న రైతులు, ఉచిత కరెంటు ఫుల్లుగా ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. అంబాజీపేటలో డిజిటల్ మీటర్ల పై అవగాహన కార్యక్రమంలో నిరసన తెలిపారు. .

# భారమైన మల్లన్నదర్శనం

**శ్రీశైలం** ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం భ్రమర, మల్లికార్జున స్వామి వార్ల ధర్శనం ఇప్పుడు భక్తులకు అందని ద్రాక్షగా మారింధి. యేటా మహాశివరాత్రి, ఊగాధి పర్వధినాల్లో స్వామి అమ్మవార్ల ధర్శనం కోసం ధట్టమైన అడవిలో భక్తులు కాలినడకన వెళ్తుంటారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక నుంచి లక్షలాధి మంధి భక్తులు భ్రమర సమేత మల్లికార్జున స్వామి వార్లను ధర్శనం చేసుకుంటారు. మహాశివారాత్రి పురష్కరించుకుని ఈ యేడాధి ఐధు లక్షల మంధి భక్తులు కాలినడకన వెళ్ళే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో భక్తుడి నుంచి రూ.10 వసూలు చేయాలని ఆటవీశాఖ నిర్ణయించింధి. ఆత్మకూరు నుంచి మొదధలైన కాలినడక వెంకటాపురం, నాగలూటీ, దామెరకుంట, మటంబావి, భీముని కొలను, ఇలకైలాసం వరకు కొనసాగుతుంధి. ధాధాపు 40కీ.మీ నల్లమల అడవిలో నడక మార్గంలో వెళ్లాల్సి ఉంటుంధి. అయితే పల్లెకట్ట వద్ద ఆటవీసిబ్బంధి బేస్ క్యాంపు యేర్పాటు చేసి ఒక్కో కాలినడక భక్తుని నుంచి రూ.10 తీసుకుని రశీధు ఇస్తున్నారు. డబ్బులు చెల్లించని భక్తులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో అటవీశాఖ తీరుపై భక్తులూ మండిపడుతున్నారు. డబ్బులు వసూలు చేయడాన్ని నిరశిస్తూ భక్తులు అంధోళన చేపట్టారు. డబ్బు వసూలుకు సంబంధించి ఉత్తర్వు కాపీ చూపమని భక్తులు అడిగితే ఆటవీశాఖ సిబ్బంది నీళ్ళు నములుతున్నారు. ప్రస్తుతం తమ వద్ద యెలాంటి జీవో లేధని.. అధికారుల స్టాంపు ముద్రతో ఉన్న రశీధు ఇస్తున్నామని ఆటవీ సిబ్బంధీ చెబుతున్నారు. యేటా స్వామి ధర్శనానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు ప్రభుత్వం, ధేవస్థానం అధికారులు ఆటవీ మార్గంలో కనీస సౌఖర్యాలు కల్పించకపోగా, చార్జీల పేరిట ఇబ్బంధులకు గురి చేస్తున్నారని విశ్వహింధూపరిషత్ నేతలు మండిపడుతున్నారు. అడవి మార్గంలో అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ ధేవుడి ధర్శనానికి నడిచి వెళ్తూ డబ్బులు యేలా చెల్లించాలని భక్తులు ఆవేధనవ్యక్తం చేస్తున్నారు. ఈసారి మహాశివరాత్రి, ఊగాధికి లక్షల మంధి కాలినడకన శ్రీశైలంకు వస్తారని రెండు నెలలో కోటికి పైగా వసూళు అయ్యే ఆవకాశం ఉంధని భక్తులు చెబుతున్నారు. అటవీశాఖలోని ఓ ఉన్నతాధికారి ధనార్జనే ధ్యెయంగా కాలినడక భక్తులపై చార్జీల భారం మోపుతున్నారని విశ్వ హింధూపరిషత్ నేతలు ధుయ్యపడుతున్నారు. భక్తుల మనోభావాలు ధేబ్బతినకుండా ప్రభుత్వం చొరవ చూపి ఛార్జీల వసూలు చేయకుండా చూడాలని మల్లన్న భక్తులు కోరుతున్నారు.

## ఏసీబీ అధికారులు పనులు పరిశీలన

**శ్రీశైలం** నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రానికి మరోసారి ఏసిబి అధికారులు చేరుకున్నారు గతంలో జరిగిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు ఔటర్ రింగ్ రోడ్డు ప్రహరిగోడలను కొలతలు తీసుకున్నారు నాణ్యత పరమైన విషయాలను పరిశీలించారు శ్రీశైలం దేవస్థానం ఇంజనీర్లను వెంటపెట్టుకుని వారివద్ద వివరాలు సేకరించారు గతంలో చేసిన పనుల వివరాలతో కూడిన బ్లూ ప్రింట్ మ్యాప్ తో ఎక్కడెక్కడ పనులు జరిగాయని తెలుసుకున్నారు గతంలో అవకతవకలు జరిగాయని పిర్యాదులు రావడంతో దఫదపాలుగా క్షేత్రంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగిందని మిగిలిపోయిన వర్కులను ఇప్పుడు పరిశీలిస్తున్నట్లు కర్నూలు ఏసిబి సిఐ విశ్వనాథ్ మౌకికంగా మీడియాకు వివరించారు...

### మారిషస్‌లో ఎంజాయ్ చేస్తున్న

# అనుపమ

టాలీవుడ్‌లో పరిచయం అక్కర్లేని మలయాళ కుట్టి అనుపమ పరమేశ్వరన్. తన కర్లీ హెయిర్‌తో, చబ్బీ లుక్స్‌తో టాలీవుడ్‌లో కోట్లాదిమంది అభిమానులు, ఫాలోవర్లను సంపాదించుకుంది. కార్తికేయ 2తో బ్లాక్ బస్టర్ హిట్టు ఖాతాలో వేసుకున్న ఈ భామ.. ఇటీవలే ఈగల్ సినిమాలో నటించి మెప్పించింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ సినిమాలు చేస్తుంది. ఇక త్వరలో టిల్లు స్క్వేర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ భామ.. షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి వెకేషన్‌కు చెక్కేసింది. తాజాగా మారిషస్ టూర్‌కు వెళ్లిన వీడియోను అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మారిషస్ అడవుల్లో రోప్ డైవింగ్, సైకిల్ తొక్కడం, కార్ రేస్, బోటింగ్, బీచ్‌లు సెలయేళ్ల వద్ద ఫుల్ గా ఎంజాయ్ చేస్తూ సాహసాలు చేసింది. అంతేకాకుండా అడవిలో ఉన్న జంతువులను పలకరిస్తూ.. ప్రకృతిని ఆస్వాదించింది. తాజాగా ఈ అడ్వెంచర్‌నంతా వీడియో రూపంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



### దయచేసి నాపేరు

# వాడుకోకండి



రాజకయీా నేతలకు మోహన్‌బాబు సూచన

నటుడు మోహన్‌బాబు ఎప్పుడూ ముక్కుసూటిగా ఉంటారు. నిర్మొమమాటంగా మాట్లాడుతారు. ఏ రాజకీయ పార్టీ వారైనా తన పేరును స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని సీనియర్ నటుడు ఎం.మోహన్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మధ్యకాలంలో తన పేరును రాజకీయంగా కొందరు వినియోగించుకుంటున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మోహన్ బాబు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. 'మనం అనేక రకాల భావాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నాము. ఎవరి అభిప్రాయాలు వారివి. అది వారి వారి వ్యక్తిగతం. చేతనైతే నలుగురికి సాయపడటంలోనే మనం దృష్టి పెట్టాలిగానీ సంబంధం లేని వారిని రాజకీయ పార్టీలలోకి వారి వారి అనుబంధం సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరం. నాకు అండదండగా ఉన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ శాంతి సౌభ్రాతృత్వాన్ని వ్యాపింపజేయడంలో అందరూ బద్ధులై ఉందామని కోరుకుంటున్నాను. నా విజ్ఞప్తిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరిస్తున్నాను' అని మోహన్ బాబు లేఖలో పేర్కొన్నారు.

### 1న విడుదల కాబోతున్న

# మా ఊరి రాజారెడ్డి



నిహాన్, వైష్ణవి కాంబ్లే జంటగా రవి బాసర దర్శకత్వంలో ఆర్ ఎస్ మూవీ మేకర్స్ పై రజిత రవీందర్ , ఎర్ర, సునీత వెంకటరమణ అయిత నిర్మాతలుగా నిర్మిస్తున్న చిత్రం మా ఊరి రాజారెడ్డి. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి మంచి స్పందన లభిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. మార్చ్ 1న గ్రాండ్ గా ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ.. మా ఊరి రాజారెడ్డి అనే సినిమా స్వర్గీయ రాజశేఖర్ రెడ్డిని గుర్తుకు చేసేలా ఉంటుంది. ఆయన అంచలంచెలుగా రాజకీయాల్లో ఒక నిష్ణాతుడైన ముఖ్యమంత్రిగా ఎదిగిన కథను మన ముందుకు తీసుకొస్తున్నారు.

ఆయన మంచితనానికి నిదర్శనంగా ఈ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన వాళ్లు, సాంకేతిక నిపుణులంతా నిర్మల్ ప్రాంతం వాళ్ళవడం నిజంగా ఆనందదాయకం అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ ఒక ముఖ్య ప్రాంతంగా మారి ఇక్కడ నుంచి మన తెలుగు సినిమాలు ప్రపంచ స్థాయికి ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేడు తెలంగాణలో నిర్మల్, అదిలాబాద్, వరంగల్ లాంటి ప్రదేశాల్లో చాలా అద్భుతమైన లొకేషన్స్, వాటర్ ఫాల్స్, అటవీ ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత వెంకటరమణ మాట్లాడుతూ.. మా ఊరి రాజారెడ్డి సినిమాని నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చిత్రీకరించామని, ఖచ్చితంగా ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుందని, ప్రేక్షకుల ఆశీస్సులు మాపై ఉండాలన్నారు.హీరో నిహాన్ మాట్లాడుతూ.. నేను సినిమాలో నటించడానికి మా అమ్మ నన్ను ప్రోత్సహించిందని,. ఈ సినిమాకి నన్ను సెలెక్ట్ చేసుకున్నందుకు మా డైరెక్టర్, ప్రొడ్యూసర్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా అన్నారు. చాలా కష్టపడి సినిమాని చేశామని, ప్రేక్షకులు చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ.. ఇది నాకు మొదటి సినిమా అని.. మా పేరెంట్స్ ని నెమ్మదిగా ఒప్పించి ఇండస్ట్రీలోకి వచ్చానని.. నన్ను ఈ క్యారెక్టర్ కి సెలెక్ట్ చేసుకున్నందుకు కృతజ్ఞతలని, కచ్చితంగా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని.. మీ అందరి ఆశీస్సులు మాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు.

కో డైరెక్టర్ రవీంద్ర సిద్దార్థ మాట్లాడుతూ.. నేను పూరి జగన్నాథ్ గారికి వీరాభిమానినని.. మా డైరెక్టర్ ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ చేసి మధ్యలో వదిలేస్తే. సెకండ్ షెడ్యూల్ నేను పూర్తి చేశానన్నారు. హైదరాబాదులో ఉండే వాళ్ళకే కాకుండా టాలెంట్ అన్నిచోట్ల ఉంటుందని.. మేం నిర్మల్ నుంచి వచ్చామన్నారు. మాలాంటి దర్శకులని ప్రోత్సహించాలని కోరుకుంటున్నా అన్నారు. మీ అందరి సపోర్ట్ ఎప్పుడు మాపై ఉండాలని ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నా అన్నారు.

# సైన్స్ ఫిక్షన్ మూవీగా ప్రభాస్ కల్కి

సలార్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్‌లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా టైటిల్‌పై ఇంట్రెస్టింగ్ న్యూస్ పంచుకున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' అని పెట్టినప్పటినుంచి ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టైటిల్ 'కల్కి 2898 ఏడీ' అని పెట్టడానికి గల కారణాన్ని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తవుతుంది. గతంతో మొదలై ఫ్యూచర్‌తో ముగుస్తుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో మొత్తం 6000 ఏండ్ల మధ్య జరిగే కథను చూపించబోతున్నాం. దానికి తగ్గట్లు ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. అంటూ నాగ్ అశ్విన్ వెల్లడించాడు. ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. అత్యంత భారీ బ్జడెట్‌తో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణెల్, దిశా పటానీ, పశుపతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో ప్రధాన




### యానిమల్ విజయాన్ని ఎంజాయ్

# చేయలేకపోయా

'యానిమల్' సినిమా నటిగా కూడా రష్మికను మరో మెట్టుపైన నిలబెట్టింది. ఆ సినిమా సాధించిన విజయం కూడా సామాన్యమైన విజయం కాదు. దాదాపుగా వెయ్యికోట్ల రూపాయలు గ్రాస్ వసూళ్లను రాబట్టింది. బాలీవుడ్‌లో విజయాలను అందుకోవడం చాలామంది హీరోయిన్ల కల. మరి ఆ కల నిజమైనా.. ఆ ఆనందాన్ని ఆస్వాదించలేకపోవడంపై రష్మిక ఇటీవల సోషల్‌మీడియాలో మాట్లాడింది. ' మా 'యానిమల్' పై ప్రశంసలు కురిశాయి. డబ్బులు కూడా అంతకంటే బాగా కురిశాయి. అయితే.. ఆ విజయాన్ని ఎంజాయ్ చేయలేకపోయాను. కనీసం ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేకపోయాను. దానికి కారణం ఒప్పుకున్న ప్రాజెక్ట్‌లే. నేను చేస్తున్న సినిమాలన్నీ ప్రతిష్టాత్మకమైనవే. ఆ సినిమాల షూటింగులకోసం రాత్రింబవళ్లూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. అందుకే 'యానిమల్' టీమ్‌తోపాటు అభిమానుల్ని కూడా మిస్ అయ్యాను. ఆ లోటును నా రాబోయే సినిమాలు భర్తీ చేస్తాయని భావిస్తున్నాను. అభిమానుల ప్రేమ ఇచ్చేంత సంతోషం నాకు ఏదీ ఇవ్వదు' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా..



### 22న వస్తోన్న

# రోటి కపడా రొమాన్స్

టాలీవుడ్ యువ నటులు హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్ నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోటి కపడా రొమాన్స్' . ఈ సినిమాకు విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ పెయిన్ ఆఫ్ 'రోటి కపడా రొమాన్స్' పేరిట ఫిబ్రవరి 27న స్పెషల్ వీడియో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇక ఈ చిత్రం మార్చి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం,
వంటి యూత్ ఫుల్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన లక్కీ మీడియా సంస్థ అధినేత బెక్కెం వేణుగోపాల్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. సృజన్ కుమార్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు.

# ఈ వస్తువులు అచ్చం ఒరిజినల్..

# కానీ ఫేక్

- బ్రాండెడ్ వస్తువుల మాదిరే నకిలీలు
- నాణ్యమైన సరకులకు ఏమాత్రం తీసిపోని కల్తీ
- మీరు కొనే వస్తువులు 'నకిలీ'వేమో పరిశీలించుకోండి?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈ వస్తువులు అచ్చం నాణ్యమైన వాటిలాగే కనిపిస్తాయి. కానీ అవి పక్కా ఫేక్. ఇంకా చెప్పాలంటే అవన్నీ నకిలీవే. ఇవి వాడితే ఎంతటి ఆరోగ్యవంతులైనా ఇట్టే అనారోగ్యం పాలవుతారు. అలాంటి వస్తువులను పోలీసులు పట్టుకున్నారు. కానీ అవి అప్పటికే మార్కెట్లోకి విడుదలయ్యాయి. మీరు ఈ వస్తువులు కొన్నారో ఏమో ఓసారి చెక్ చేసుకోండి.

ప్రముఖ కంపెనీలకు చెందిన నిత్యావసరాల వస్తువులకు నకిలీవి తయారీ చేసి విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ టాస్క్?ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నాగారం, కాటేదాన్‌లో తయారీ సెంటర్లను సీజ్ చేసి రెండు కోట్ల విలువైన నకిలీ వస్తువులను సీజ్ చేశారు. ఛాయ్ పత్తి, వాషింగ్ పౌడర్స్, వాషింగ్ సోప్స్, హెయిర్ ఆయిల్స్ ఇలా నిత్యావసర వస్తువులను విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. రాజస్థాన్, బిహార్‌కు చెందిన నిందితులు ప్రముఖ కంపెనీలకు చెందిన వస్తువులను నకిలీగా తయారు చేసి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డారు.

## ప్రజల ప్రాణాలు పైకే...

కంపెనీలు ఇచ్చిన ధర కంటే తక్కువ ధరకు ఉండటంతో ఎక్కువ లాభాలు వస్తాయని డిస్ట్రిబ్యూటర్స్ వీటిని కిరాణా షాపుల్లో అమ్ముతూ ప్రజాఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఈ దొంగ సరుకును సామాన్య జనాలు గుర్తు పట్టలేనంతగా ఉంటాయి. రెండేళ్లుగా నకిలీ వ్యాపారం చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ముందస్తు సమాచారంతో రావడంతో వీటిని తయారు చేస్తున్న నాగారం, కాటేదాన్‌లో ఉన్న తయారీ కేంద్రాలపై సోదాలతో నకిలీ వస్తువులను తయారు చేసేందుకు వాడే పరికరాలను బ్యాన్ చేశారు.

## కిరాణా సరుకులు ఇవే :

రెడ్? లేబుల్, బ్రూక్ బ్రాండ్ టీ పౌడర్స్, పారచూట్ హెయిర్ ఆయిల్, ఎవరెస్ట్ మసాలా హార్పిక్, లైజాల్, సర్ఫ్ ఎక్సల్ లాంటి బ్రాండెడ్ ఉత్పత్తులను లేబుల్స్ వేసి అమ్ముతున్నారు. హానికరమైన రసాయనాలతో తయారు చేసిన ఉత్పత్తుల్ని మార్కెట్లో అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేల్చారు. ఈ కేసులో ముగ్గురి నిందితులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని డీసీపీ గిరిధర్ వివరించారు.

## కల్తీపై సమాచారం ఇస్తే, తాటా తీస్తాం ....

కల్తీ సరకుల కేసులో మహేంద్రసింగ్ ప్రధాన నిందితుడు కాగా తన అనుచరులతో ప్రముఖ కంపెనీలకు చెందిన నిత్యావసరాల వస్తువులకు నకిలీ సరుకులు తయారీ చేస్తున్నాడు. దీంతో కోట్లు కొల్లగొడుతున్నాడు. వీటి విలువ రెండు కోట్లు ఉంటుందని ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్ పేర్కొన్నారు. వినియోగదారులు నిత్యావసర వస్తువుల గురించి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు కోరారు. నకిలీ వస్తువులను గుర్తిస్తే వెంటనే తమకు సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మీడియా అకాడమీ చైర్మన్‌కి శుభాకాంక్షలు తెలిపిన శ్రీధర్ యాలాల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ గా నియమితులైన ప్రజాపక్షం సంపాదకులు, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) జాతీయ అధ్యక్షులు కే. శ్రీనివాస్ రెడ్డిని నెట్జ్ డిజిటల్ మీడియా ఎండి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ యాలాల మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ యాలాల మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తికి మీడియా అకాడమీ ఛైర్మన్ పదవి రావడం శుభ సూచికం అన్నారు. జర్నలిస్టుల సమస్యలు తెలిసిన శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అది నా తప్పే

## - సుప్రీంకోర్టులో అంగీకరించిన అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పరువు నష్టం కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టుకు హాజరైన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన తప్పును ఒప్పుకున్నారు. ఓ యూట్యూబర్ సర్క్యులేట్ చేస్తున్న వీడియోను రీట్వీట్ చేసి తాను తప్పు చేశానని కేజ్రీవాల్ అంగీకరించారు. పరువుకు భంగం కలిగించే వీడియోను షేర్ చేసి తప్పు చేసినట్లు సోమవారం సుప్రీం కోర్టు ఎదుట కేజ్రీవాల్ ఒప్పుకున్నారు. అయితే ఇదే కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన సమన్లను సుప్రీం కోర్టులో సవాల్ చేసిన కేజ్రీవాల్ ఎట్టకేలకు తనదే తప్పని అంగీకరించడం గమనార్హం. తప్పును అంగీకరించడంతో పరువు నష్టం కేసులో కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. బీజేపీ ఐటీ సెల్‌కు సంబంధించి యూట్యూబర్ ధ్రువ్ రాఠీ అనే వ్యక్తి 2018 మే నెలలో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోను అరవింద్ కేజ్రీవాల్ రీట్వీట్ చేశారు. అయితే ఆ వీడియో కొందరిని కించపరిచేలా ఉందని వికాస్ సాంకృత్యాయన్ అనే వ్యక్తి పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు అరవింద్ కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఆ ట్రయల్ కోర్టు సమన్లను ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. ఒకరిని కించపరిచేలా ఉన్న వీడియోను ఇతరులకు పంపడం కూడా పరువునష్టం చట్టం కింద నేరమే అవుతుందని పేర్కొంది. అలాంటి విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సమయంలోనే ట్రయల్ కోర్టు ఇచ్చిన సమన్లను కొట్టివేయడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. చివరికి ఆ వీడియోను రీట్వీట్ చేయడం తప్పేనని అంగీకరించారు. జర్మనీలో ఉండే ధ్రువ్ రాఠీ బీజేపీ ఐటీ సెల్ పార్ట్ పేరిట తప్పుడు ఆరోపణలు ఉన్న ఒక వీడియోను సర్క్యులేట్ చేశారని ఆ వీడియోను అరవింద్ కేజ్రీవాల్‌పై ఫిర్యాదుదారుడు వికాస్ సాంకృత్యాయన్ పరువు నష్టం కేసు వేశారు.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588